సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
శనివారం, 12.09.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 313
పేజీలు: 08 వెల: రూ. 5

## సెలబ్రిటీలకు ఎస్ఐఆర్ షాక్..
### సెలబ్రిటీల ఓటర్ల వివరాల్లో తేడాలు..
- మహేష్, రాజమౌళి, వీవీఎస్‌లకు నోటీసులు
- సినీ, క్రీడా ప్రముఖులకు సైతం ఎస్ఐఆర్ నోటీసులు

02



## పార్టీలకు అడ్డు చెప్తున్నాడని
### మామను చంపించిన కోడలు



- దిండుతో నలిపి.. కత్తితో 26 సార్లు పొడిచి
- రూ.6 లక్షల సుపారీతో ఫార్మా వ్యాపారవేత్త దారుణ హత్య
- కాన్పూర్ మామ హత్య కేసులో సీసీటీవీలో బయటపడ్డ నిజం

02

# ప్రపంచ శక్తుల సంగమం
## మోదీ దౌత్యంతో బలపడనున్న బ్రిక్స్ బంధం!



- ఢిల్లీకి తరలివస్తున్న ప్రపంచ అగ్రనేతలు..
- మోదీ–పుతిన్–జిన్‌పింగ్ భేటీపై ఉత్కంఠ
- 21 దేశాల అధినేతల రాకతో ఢిల్లీలో సందడి
- బ్రిక్స్ సదస్సుకు కట్టుదిట్టమైన భద్రత
- భారత్ మండపంలో కీలక దౌత్య చర్చలు
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై అగ్రనేతల మంతనాలు
- మారుతున్న ప్రపంచ సమీకరణాలకు ఢిల్లీ వేదిక
- 30 వేల మందితో భారీ భద్రతా ఏర్పాట్లు
- బ్రిక్స్ భేటీలతో కొత్త దౌత్య సమీకరణాలకు తెర

విదేశీ అతిథులకు భారతీయ సంప్రదాయ వంటకాల విందు

**ముద్ర, న్యూఢిల్లీ:**
ప్రపంచ రాజకీయ, ఆర్థిక సమీకరణాలు వేగంగా మారుతున్న వేళ.. అంతర్జాతీయ దౌత్యానికి భారత్ మరోసారి కేంద్రబిందువుగా మారింది. 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు ప్రపంచ అగ్రనేతలు దేశ రాజధాని ఢిల్లీకి చేరుకుంటున్నారు. రెండు రోజుల పాటు భారత్ మండపంలో జరగనున్న ఈ సదస్సు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, వాణిజ్యం, దౌత్య సంబంధాల భవిష్యత్ దిశపై కీలక చర్చలకు వేదిక కానుంది.
రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సహా 21 దేశాల అధినేతలు ఈ సదస్సుకు హాజరవుతున్న నేపథ్యంలో ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. దాదాపు 30 వేల మంది భద్రతా సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. విదేశీ అతిథులకు భారతీయ సంప్రదాయ వంటకాలను ప్రత్యేకంగా సిద్ధం చేస్తున్నారు.

**పుతిన్–జిన్‌పింగ్‌తో మోదీ భేటీపై ఉత్కంఠ**
సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీతో రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ జరిపే ద్వైపాక్షిక చర్చలపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకృతమైంది. ఉక్రెయిన్ యుద్ధం, అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతలు, ఇంధన భద్రత, డాలర్ ఆధిపత్యం, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలు వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది.
ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అభివృద్ధి చెందుతున్న దేశాల పాత్రను మరింత బలోపేతం చేయడం, పరస్పర వాణిజ్యం–పెట్టుబడులను పెంచడం, అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణల కోసం ఉమ్మడి స్వరాన్ని వినిపించడం వంటి అంశాల్లో బ్రిక్స్ దేశాల మధ్య ఏకాభిప్రాయ సాధన కీలకం కానుంది.
యుద్ధాలు, వాణిజ్య పోటీలు, శక్తిమంత దేశాల మధ్య మారుతున్న సంబంధాల నేపథ్యంలో.. ఢిల్లీలో జరిగే బ్రిక్స్ సదస్సు కేవలం ఓ అంతర్జాతీయ సమావేశం కాదు. మారుతున్న ప్రపంచ రాజకీయ, ఆర్థిక సమీకరణాలకు కొత్త దిశను నిర్దేశించే కీలక వేదికగా నిలవనుంది.

## మూసీకి ఎదురుదెబ్బ
### మూసీ ప్రాజెక్టుపై ఎన్జీటీలో కొత్త పిటిషన్

02

- ప్రభుత్వానికి నోటీసులు జారీ
- పర్యావరణ అనుమతులపై రిటైర్డ్ ఇంజినీర్ల అభ్యంతరాలు
- 55 కి.మీ.లో 20 కి.మీ. అధ్యయనంపై ప్రశ్నలు
- ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నిర్మాణాలపై అభ్యంతరం



## యుద్ధం ఆపండి
### పుతిన్‌తో భేటీలో మోదీ




- చర్చలతోనే యుద్ధానికి ముగింపు
- ఉక్రెయిన్‌పై మోదీ శాంతి పిలుపు
- పుతిన్‌కు మోదీ స్పష్టమైన సందేశం
- భారత్ శాంతి ప్రయత్నాలకు సిద్ధం

02

## వారితోనే స్నేహం చేయాలి
### బ్రిక్స్ సదస్సుకు ముందు మోదీ పోస్ట్


Narendra Modi @narendramodi · 37m
Addressing the BRICS Business Forum. Strong business partnerships can open new avenues for growth, innovation and shared prosperity.

@BricsIndia2026

- సద్గుణాలున్న వారితోనే స్నేహం
- దుర్గుణాలున్నవారికి దూరంగా ఉండాలి
- ప్రపంచ సంక్షేమంపై అర్థవంతమైన చర్చలకు పిలుపు

02




## గుంత తీసి కప్పెట్టి
### కొల్లిక్కి బొల్లారం ఆర్మీ ఆయుధాల చోరీ కేసు

- చోరీ చేసిన ఆయుధాలు స్వాధీనం
- 12 ఆయుధాలు.. గుంతలో పాతిపెట్టిన దొంగ
- మల్లేశ్ నోరు విప్పడంతో బయటపడ్డ వెపన్స్
- చోరీపై డీజీపీ ఆనంద్ ప్రకటన

02



### కేబినెట్ విస్తరణపై రేవంత్‌కు
## కొత్త చిక్కులు!
### మూడు ఖాళీలు.. భారీగా ఆశలు

- సామాజిక, ప్రాంతీయ సమీకరణాలతో అధిష్ఠానానికి తలనొప్పి
- ఎవరికి పదవి ఇచ్చినా.. మరొక వర్గంలో అసంతృప్తి భయం
- స్థానిక సంస్థల ఎన్నికల వేళ విస్తరణ వాయిదాకే మొగ్గు?

**ముద్ర డెస్క్:**
తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో చాలాకాలంగా నానుతున్న కేబినెట్ విస్తరణ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణల నేపథ్యంలో మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడంతో.. ఇప్పటికే ఖాళీగా ఉన్న రెండు స్థానాలతో కలిపి ప్రస్తుతం కేబినెట్‌లో మూడు బెర్తులు ఖాళీగా ఉన్నాయి. అయితే ఈ మూడు స్థానాల భర్తీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఊరట కలిగించే అంశంగా కాకుండా.. కొత్త రాజకీయ చిక్కులను తెచ్చిపెట్టే పరిస్థితి కనిపిస్తోంది.
మూడు పదవులకు ఆశావహుల సంఖ్య భారీగా ఉండటంతో ఎవరికి అవకాశం ఇవ్వాలి? ఎవరిని పక్కన

మిగతా 02లో



## కొండల్, తొండల్, అనకొండల్ దందా
### రేవంత్‌పై కేటీఆర్ సంచలన ఆరోపణలు

- భూ దందాల కాంగ్రెస్ సర్కార్
- 22ఏ భూ బాధితుల భేటీలో సీఎం రేవంత్‌పై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు!



02

### ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 12.09.2026
www.mudranews.in | @mudranews



### ప్రొటీన్‌కు ప్రాధాన్యం



గుడ్లు, పాలు, పెరుగు, పన్నీర్, పప్పులు, శనగలు, రాజ్మా, సోయా, చేపలు, చికెన్ తీసుకోవాలి. పిల్లల ఎదుగుదలతో పాటు కణజాలాల మరమ్మతుకు ప్రొటీన్ కీలకం.

## దస్త్రాల పరిష్కారంలో జాప్యం వద్దు

### మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు వెంటనే పరిష్కృతం చేయాలి

- ఇక ఆన్‌లైన్‌లోనే అన్ని దస్త్రాల నిర్వహణ...
- నెలరోజుల్లో భౌతిక ఫైళ్లకు ముగింపు
- స్వర్ణ గ్రామ, వార్డు సిబ్బంది జాబ్‌ఛార్ట్ సిద్ధం చేయండి
- 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు
- సమావేశానికి గైర్హాజరైన అధికారులపై సీఎం ఆగ్రహం
- వివరణ తీసుకోవాలని సీఎస్‌కు ఆదేశం
- రెండ్రోజుల్లోపు ఫైళ్లు క్లియర్ చేసినవారికి అభినందనలు
- గంటల్లో పూర్తి చేసిన వారికి సీఎం ప్రత్యేక ప్రశంసలు



**ముద్ర, అమరావతి:**
ప్రభుత్వ పాలనలో దస్త్రాల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు ఫైళ్లను త్వరితగతిన క్లియర్ చేయాలని సూచించారు. రెండు రోజుల్లోపు ఫైళ్లు పరిష్కరించిన అధికారులను అభినందించిన సీఎం.. గంటల్లోనే పూర్తి చేసిన వారిని ప్రత్యేకంగా ప్రశంసించారు. కలెక్టర్ల సదస్సుకు గైర్హాజరైన అధికారులపై వివరణ తీసుకోవాలని సీఎస్‌ను ఆదేశించారు.
అన్ని ప్రభుత్వ శాఖల్లో ఇక ఆన్‌లైన్‌లోనే ఫైళ్ల నిర్వహణ చేపట్టాలని, నెల రోజుల్లో భౌతిక ఫైళ్లకు ముగింపు పలకాలని స్పష్టం చేశారు. మాన్యువల్ ఫైళ్ల నిర్వహణను ఇకపై తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. కార్యదర్శులు తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ శాఖల్లో ఏఐ, డీప్‌టెక్ వంటి సాంకేతికతలను విస్తృతంగా వినియోగించాలని సీఎం అన్నారు. ప్రజల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా పాలనలో లోటుపాట్లను సరిచేసుకోవాలని సూచించారు. స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో సిబ్బంది పనిభారాన్ని రేషనలైజ్ చేసి, ప్రతి ఉద్యోగికి స్పష్టమైన బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. ప్రతి పంచాయతీ పరిధిలో స్వర్ణ గ్రామ సిబ్బంది విధుల కోసం జాబ్‌ఛార్ట్ సిద్ధం చేయాలని తెలిపారు.



## కొండల్, తొండల్, అనకొండల్ దందా

**ముద్ర, హైదరాబాద్ :**
తెలంగాణ భవన్‌లో సెక్షన్ 22ఏ భూ బాధితులతో జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. తమ్ముడు.. లెట్స్ డూ కుమ్ముడు అన్న రీతిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెట్టాపట్టాల్‌వేసుకుని రాష్ట్రాన్ని దోచేసుకుంటున్నారని ఆరోపించారు. కొండల్, తొండల్, అనకొండల్ అంటూ రేవంత్ రెడ్డి సోదరుడు అనుముల కొండల్ రెడ్డి, పొంగులేటి వర్గీయులను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో భూ దందాలు, ల్యాండ్ కబ్జాలు పరాకాష్ఠకు చేరాయని, అస్మదీయులకు దోచిపెట్టడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు.
తెలంగాణ రాకముందు రియల్ ఎస్టేట్ రంగానికి ఎలాంటి భరోసా లేదని, కానీ కేసీఆర్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే నీరు, విద్యుత్ సమస్యలను తీర్చి భూముల విలువను ఊహించని స్థాయికి తీసుకెళ్లారని కేటీఆర్ గుర్తుచేశారు. ఒకప్పుడు ఎకరం రూ. 5 లక్షలు ఉన్న భూమి కేసీఆర్ హయాంలో రూ. 50 లక్షలకు పెరిగిందని, దీంతో ప్రజలు భూమిపై పెట్టుబడులు పెట్టేందుకు ధైర్యంగా ముందుకు వచ్చారని తెలిపారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో భూమి కనిపిస్తే బుక్క పెట్టు.. జాగా కనిపిస్తే పాగా వేయ్ అనే చందంగా దందాలు నడుస్తున్నాయని విమర్శించారు. గాంధీల పేరు చెప్పుకుని రాష్ట్రాన్ని ఏలుతున్న లీడర్లు గజదొంగల్లా మారారని ఆరోపించారు.
రాష్ట్రంలో అధికారికంగా ఒక రెవెన్యూ వ్యవస్థ ఉంటే.. తెరవెనుక అదృశ్య శక్తులతో కూడిన మరో సమాంతర రెవెన్యూ సామ్రాజ్యం నడుస్తోందని కేటీఆర్ సంచలన ఆరోపణ చేశారు. ఫైళ్లు ఎవరి ఆదేశాల మేరకు కదులుతున్నాయో, అసైన్డ్ భూములు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందన్నారు. లగచర్లలో తమ అల్లుడికి భూములు కట్టబెట్టడానికి గిరిజనుల పొలాలను గుంజుకున్నారని, హైదరాబాద్ చుట్టూ ఉన్న రూ. వేల కోట్ల విలువైన 10 వేల ఎకరాల భూములపై సీఎం రేవంత్ రెడ్డి కన్ను పడిందని విమర్శించారు. మూసీ ముసుగులోనూ, ఫ్యూచర్ సిటీ పేరుతోనూ పెద్ద ఎత్తున రియల్ దందాకు తెరలేపారని దుయ్యబట్టారు.
కేసీఆర్ హయాంలో కొంగరకలాన్‌కు ఫాక్స్‌కాన్ వంటి దిగ్గజ కంపెనీ తెచ్చి ప్రాంతపు రూపురేఖలు మార్చితే, రేవంత్ రెడ్డి మాత్రం రూ. 200 కోట్ల విలువైన భూమిని తన తమ్ముడికి చెందిన కంపెనీకి కేవలం రూ. 7 కోట్లకే అడ్డికి పావుశేరు లెక్కన కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. రూ. 1,000 కోట్ల మాయాజాలానికి తెరతీసి కొంగరకలాన్ భూములను కాజేసే కుట్ర జరుగుతోందన్నారు. భూములు ఇచ్చేందుకు నిరాకరించిన సామాన్యుల స్థలాలను ఉద్దేశపూర్వకంగానే నిషేధిత జాబితా అయిన 22ఏ కింద పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు.
గతంలో ధరణి పోర్టల్‌లో బయోమెట్రిక్ వేలిముద్ర పడితే తప్ప అంగుళం భూమి కూడా మారేది కాదని, కానీ నేటి కాంగ్రెస్ భూభారతి అవతారంలో భూముల గోల్‌మాల్‌ను యథేచ్ఛగా నడిపిస్తున్నారని ధ్వజమెత్తారు. సెక్షన్ 22ఏ ఆధారంగా ఓ ముఠాను ఏర్పాటు చేసుకుని అమాయక ప్రజల ఆస్తులను గుంజుకుంటున్న ఈ కుంభకోణంపై ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బాధితుల తరపున బీఆర్ఎస్ పోరాడుతుందని, ప్రభుత్వం చేస్తున్న ఈ అక్రమాలపై న్యాయపరంగా, ప్రజాక్షేత్రంలోనూ నిలదీస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## కేబినెట్ విస్తరణపై రేవంత్‌కు కొత్త చిక్కులు!

(మొదటి పేజీ తరువాయి)
పెట్టాలి? అన్నది కాంగ్రెస్ అధిష్ఠానానికి సవాల్‌గా మారింది. ఒక్కరికి మంత్రి పదవి దక్కితే.. మరొకరు అసంతృప్తి వ్యక్తం చేసే అవకాశం ఉండటంతో విస్తరణ ప్రక్రియ కత్తిమీద సాములా మారింది.

**రెడ్డి నేతల పోటీ తీవ్రం**

కేబినెట్ బెర్తుల కోసం ప్రధానంగా సీనియర్ రెడ్డి సామాజికవర్గ నేతలు గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి వంటి నేతల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అయితే ఇప్పటికే మంత్రివర్గంలో రెడ్డి సామాజికవర్గానికి గణనీయమైన ప్రాతినిధ్యం ఉంది. ఈ నేపథ్యంలో మిగిలిన మూడు స్థానాల్లోనూ రెడ్డి వర్గానికే అధిక ప్రాధాన్యం ఇస్తే.. బీసీ, ఎస్టీ, లంబాడా వంటి వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమయ్యే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. అదే సమయంలో సీనియర్ రెడ్డి నేతలను పూర్తిగా పక్కనపెడితే.. వారు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని నేరుగా ప్రశ్నించే పరిస్థితి తలెత్తవచ్చన్న ఆందోళన కూడా కాంగ్రెస్ వర్గాల్లో ఉంది.

**ప్రాంతీయ సమీకరణాలూ కీలకమే**

సామాజిక సమీకరణాలతో పాటు ప్రాంతీయ ప్రాతినిధ్యం కూడా కేబినెట్ విస్తరణలో కీలకంగా మారింది. ఉమ్మడి నిజామాబాద్, హైదరాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి ప్రస్తుతం మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడంతో ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలు మంత్రి పదవులను ఆశిస్తున్నారు. మరోవైపు కొండా సురేఖ నిష్క్రమణతో బీసీ సామాజికవర్గానికి చెందిన ఒక బెర్త్ ఖాళీ కావడంతో.. ఆ స్థానాన్ని అదే సామాజిక సమీకరణంతో భర్తీ చేయాలన్న ఒత్తిడి కూడా ఉంది. బీసీ కోటాలో ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య పేర్లు వినిపిస్తుండగా.. ఎస్టీ లంబాడా వర్గం నుంచి బాలు నాయక్, రామచంద్రు నాయక్ వంటి నేతలు మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

**మూడు బెర్తులు.. ఎన్నో లెక్కలు**

ఒకవైపు సీనియర్ల ఒత్తిడి.. మరోవైపు సామాజిక సమతుల్యత.. ఇంకోవైపు ప్రాంతీయ ప్రాతినిధ్యం. ఈ మూడు అంశాలను సమన్వయం చేయడం రేవంత్‌రెడ్డి ముందున్న అసలు సవాల్‌గా మారింది. ఇప్పటికే మంత్రి పదవులు దక్కని నేతల్లో అసంతృప్తి ఉన్న నేపథ్యంలో.. విస్తరణ పేరుతో కొత్తగా అసమ్మతి వర్గాలు ఏర్పడే ప్రమాదం లేకపోలేదు. ముఖ్యంగా పదవి ఆశించి భంగపడిన సీనియర్లు బహిరంగంగా వ్యాఖ్యలు చేస్తే.. అది ప్రతిపక్షాలకు రాజకీయ అస్త్రంగా మారే అవకాశం ఉంది.

**ఎన్నికల ముందు ఎందుకు రిస్క్?**

రాబోయే స్థానిక సంస్థలు, కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు ముదరడం పార్టీకి ప్రతికూలంగా మారే ప్రమాదం ఉంది. అందుకే ఇప్పటికిప్పుడు కేబినెట్ విస్తరణ చేపట్టి కొత్త తలనొప్పులు తెచ్చుకోవడం కంటే.. కొంతకాలం వేచి చూడటమే వ్యూహాత్మకంగా మంచిదన్న అభిప్రాయం రేవంత్ వర్గంలో ఉన్నట్లు తెలుస్తోంది. మంత్రి పదవి దక్కని ఆశావహులను నామినేటెడ్ పోస్టులు, కార్పొరేషన్ ఛైర్మన్ పదవులతో సంతృప్తిపరచడం ద్వారా అసమ్మతిని చల్లార్చే ప్రయత్నాలు ముందుగా జరిగే అవకాశం ఉంది. ఆ తర్వాతే కేబినెట్ విస్తరణపై తుది నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. హైకమాండ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా.. మూడు బెర్తుల భర్తీ అంత సులువు కాదన్నది మాత్రం స్పష్టమవుతోంది. పదవుల పంపకంలో సామాజిక, ప్రాంతీయ సమీకరణాలను ఎంత సమర్థంగా బ్యాలెన్స్ చేస్తారన్నదే ఇప్పుడు రేవంత్‌రెడ్డి రాజకీయ నాయకత్వానికి అసలు పరీక్షగా మారింది.



## పార్టీలకు అడ్డు చెప్తున్నాడని





**ముద్ర, ఢిల్లీ:**
ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. పార్టీలకు వెళ్లకుండా అడ్డుకోవడంతో పాటు ఇంట్లో సీసీటీవీలతో నిఘా పెట్టి, ఆర్థిక విషయాల్లో ఆంక్షలు విధిస్తున్నాడనే కోపంతో ఓ మహిళ తన మామను సుపారీ ఇచ్చి హత్య చేయించింది.
కాన్పూర్‌కు చెందిన ఓ ఫార్మా వ్యాపారవేత్త శనివారం రాత్రి ఇంట్లోనే కత్తులతో దాడికి గురై మరణించాడు. దుండగులు అతడిని ఏకంగా 26 సార్లు పొడిచి హత్య చేశారు. అయితే ఇంట్లో నగదు, నగలు చోరీ కాకపోవడంతో పోలీసులు ఇది పక్కా ప్లాన్‌తో చేసిన హత్యగా అనుమానించారు.
సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించగా.. వ్యాపారవేత్త కుమారుడు, కోడలు పార్టీకి వెళ్లిన సమయంలో ఇద్దరు వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించినట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా.. కోడలు రూ.6 లక్షలు సుపారీ ఇచ్చి హత్య చేయించిందని వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.
గతంలో ఆ ఇంట్లో పనిచేసిన వ్యక్తికి కోడలు అసలు తాళం ఇచ్చి డూప్లికేట్ తాళం తయారు చేయించినట్లు దర్యాప్తులో తేలింది. తొలుత దిండుతో ఊపిరాడకుండా చేసి గుండెపోటుగా చిత్రీకరించాలని ప్లాన్ చేసినా, వ్యాపారవేత్త మేల్కోవడంతో కత్తులతో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో కోడలితో పాటు ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

## సెలబ్రిటీలకు 'ఎస్ఐఆర్' షాక్..

**ముద్ర, హైదరాబాద్:**
ఓటు హక్కు పొందడం సాధారణ పౌరులకే కాదు.. సెలబ్రిటీలకు కూడా అంత సులభం కాదని తెలంగాణ ఎన్నికల సంఘం తాజా చర్యలు చెబుతున్నాయి. రాష్ట్రంలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా పలువురు టాలీవుడ్, క్రీడా, వ్యాపార ప్రముఖులకు అధికారులు నోటీసులు జారీ చేశారు.
ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ అనంతరం నిర్వహించిన పరిశీలనలో మహేష్ బాబు, నమ్రత శిరోద్కర్, వెంకటేష్ దంపతులు, సమంత, విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ పేర్లు వ్యత్యాసాల జాబితాలోకి వచ్చాయి. క్రీడా రంగం నుంచి వీవీఎస్ లక్ష్మణ్, పుల్లెల గోపీచంద్, సైనా నెహ్వాల్, మిథాలీ రాజ్ తదితరుల పేర్లు కూడా ఉన్నాయి. దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళికి కూడా నోటీసులు అందినట్లు సమాచారం.
పేర్లలో అక్షర దోషాలు, తల్లిదండ్రుల వివరాల్లో తేడాలు, పాత రికార్డులతో వివరాలు సరిపోకపోవడం వంటి కారణాలతో ఈ నోటీసులు ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్ స్పందిస్తూ.. ప్రముఖులైనా, సామాన్యులైనా అందరికీ ఒకే విధమైన నిబంధనలు వర్తిస్తాయని తెలిపారు. నోటీసు అందుకోవడం అంటే ఓటు హక్కు రద్దయినట్లు కాదని స్పష్టం చేశారు. విచారణకు సెలబ్రిటీలు స్వయంగా హాజరుకావాల్సిన అవసరం లేదని, వారి తరఫున ప్రతినిధులను పంపవచ్చని తెలిపారు.
అయితే సెలబ్రిటీలకే ఇలా నోటీసులు వస్తే.. సరైన ఆధారాలు సమర్పించుకోవడం కష్టమైన సామాన్యుల పరిస్థితి ఏంటనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. సాంకేతిక లోపాల కారణంగా ఒక్క అర్హుడి ఓటు హక్కు కూడా కోల్పోకుండా యంత్రాంగం జాగ్రత్తలు తీసుకోవాలి.

## యుద్ధాన్ని ఆపండి

**ముద్ర, ఢిల్లీ:**
న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయ్యారు. భారత్ మండపంలో దాదాపు 45 నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో ఉక్రెయిన్ తో యుద్ధం పరిష్కారానికి.. చర్చలు, దౌత్య మార్గమే సరైనదని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. అలాగే పశ్చిమాసియా, నల్లసముద్ర ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న ఉద్రిక్తతల వల్ల సముద్ర వాణిజ్యంపై పడుతున్న ప్రభావం, భారత నావికుల భద్రతపై ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. రష్యా- ఉక్రెయిన్ దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు తనవంతు ప్రయత్నాలు చేస్తానని మోదీ హామీ ఇచ్చారు. 2022, ఫిబ్రవరిలో ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా వెలుపల జరిగిన బ్రిక్స్ సదస్సులో పుతిన్ నేరుగా పాల్గొనడం ఇదే తొలిసారి. ఈ ఏడాది ప్రధాని మోదీ, పుతిన్ మధ్య ఇది రెండో భేటీ కావడం గమనార్హం.
ఈ ద్వైపాక్షిక భేటీలో రాజకీయం, ఆర్థికం, రక్షణ, ఇంధనం, అంతరిక్షం, నైపుణ్యాభివృద్ధి తదితర రంగాల్లో ఇరుదేశాల భాగస్వామ్యంపై నాయకులిద్దరూ సమీక్ష జరిపారు. శాంతి స్థాపన కోసం ఎలాంటి సహాయానికైనా భారత్ సిద్ధంగా ఉందని మోదీ స్పష్టం చేశారు. భారత్ అధ్యక్షతన 2026లో జరుగుతున్న ఈ బ్రిక్స్ సదస్సులో ఇరుదేశాల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని, అంతర్జాతీయ అనిశ్చితుల మధ్య సైతం కొనసాగుతున్న "ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని" ముందుకు తీసుకెళ్లాలని ఇరునేతలు నిర్ణయించారు. ఈ సందర్భంగా 24వ భారత్–రష్యా వార్షిక సదస్సు కోసం రష్యాకు రావాలని పుతిన్ అందించిన ఆహ్వానాన్ని ప్రధాని మోదీ ఆమోదించారు. దీనికి సంబంధించిన తేదీలను త్వరలోనే దౌత్య మార్గాల ద్వారా ఖరారు చేయనున్నారు.
ఈ సమావేశం ప్రారంభంలో ప్రధాని మోదీ, రష్యన్ భాషలోకి అనువదించిన ప్రముఖ తమిళ ప్రాచీన గ్రంథం 'తిరుక్కురల్' పుస్తకాన్ని పుతిన్‌కు బహుమతిగా అందించారు. తిరువళ్ళువర్ రచించిన ఈ మహాగ్రంథం మానవ జీవన విలువలు, నైతికతను వివరిస్తుంది. భేటీ అనంతరం ఇరునేతలు ఒకే కారులో ప్రయాణించి 'ఇన్నోప్రామ్' ప్రదర్శనకు చేరుకున్నారు. సెప్టెంబర్ 9 నుంచి 11 వరకు భారత్‌లో తొలిసారిగా నిర్వహించిన ఈ ప్రదర్శనలో నాయకులిద్దరూ దాదాపు అరగంటకు పైగా గడిపి, ప్రతినిధులతో మాట్లాడారు. ఆ తర్వాత బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ లీడర్స్ సెషన్‌లో కలిసి పాల్గొన్నారు. ప్రధాని మోదీ, పుతిన్ మధ్య ఉన్న సాన్నిహిత్యం రెండు దేశాల వ్యూహాత్మక బంధానికి కీలక స్తంభంగా నిలుస్తోంది. గత 11 ఏళ్లలో వీరిద్దరూ కలవడం ఇది 19వ సారి.

## గుంత తీసి పాతిపెట్టి

**ముద్ర, హైదరాబాద్:**
దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సికింద్రాబాద్ బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్‌లో ఆర్మీ ఆయుధాల చోరీ కేసు ఓ కొలిక్కి వచ్చినట్లు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఈ మేరకు మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు.
'ఆగస్టు 31న మద్రాస్ రెజిమెంట్‌లోని బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో ఆయుధాల చోరీ జరిగింది. పిస్టల్స్, మ్యాగజైన్లు, బుల్లెట్స్, బైనాక్యులర్ చోరీ చేశారు. బ్రిగేడియర్ ఫిర్యాదు మేరకు బొల్లారం పీఎస్‌లో కేసు నమోదు చేశాం. 12 ఆయుధాలు, బుల్లెట్లు, బైనాక్యులర్‌ను చోరీ చేశారు. బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లోకి ఎవరెవరికి అనుమతి ఉందని విచారించాం. ఆర్మ్స్ కోట్ ఇన్‌ఛార్జ్ వినోద్‌కుమార్‌తో పాటు అమ్యునేషన్స్ కోర్టు (ఆయుధాగారం) ఇన్‌ఛార్జ్ బల్లి మధులను అనుమానితులుగా విచారించాం. ఎలాంటి ఆధారాలు దొరకలేదు. అనంతరం హవల్దార్లుగా పనిచేసిన ప్రకాశం జిల్లాకు చెందిన టీపీఎస్ రావు, నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన మల్లేశ్ అలియాస్ రాజును విచారించాం.
మా దగ్గర ఉన్న ఆధారాలతో మల్లేశ్ కదలికల గురించి ప్రశ్నించాం. కదలికల గురించి వాస్తవాలు చెప్పకుండా అతడు దాచిపెట్టాడు. తొలుత విచారణ కోసం మేం పిలిస్తే రాలేదు. ఫోన్ కాల్ లిస్ట్, వాట్సప్ చాటింగ్‌లు డిలీట్ అయ్యాయి. ఆ తర్వాత మల్లేశ్‌ను ప్రశ్నిస్తున్నప్పుడు ఆయన ముఖంలో చెమటలు పట్టి భయం కనిపించింది. కేసు తీవ్రతను ఆయన భార్యకు వివరించాం. ఆమె గట్టిగా ప్రశ్నించడంతో మల్లేశ్ నిజం అంగీకరించాడు. చోరీ చేసిన ఆయుధాలను నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని స్వగ్రామానికి తీసుకెళ్లి గుంతతీసి పాతిపెట్టాడు. వాటిని స్వాధీనం చేసుకున్నాం'' అని డీజీపీ వివరించారు.



## మూసి ప్రాజెక్టుకు ఎదురుదెబ్బ

**ముద్ర, హైదరాబాద్:**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు మరోసారి న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ రిటైర్డ్ ఇంజినీర్లు చెన్నైలోని 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్' (ఎన్జీటీ) దక్షిణాది బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై విచారణ చేపట్టిన ట్రిబ్యునల్ తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. మూసీ ప్రక్షాళన పనులకు సంబంధించి పర్యావరణ నిబంధనలు, అనుమతుల్లో లోపాలు ఉన్నాయని పిటిషనర్లు ఆరోపించారు. పరివాహక ప్రాంతం మొత్తం 55 కిలోమీటర్లు ఉంటే.. కేవలం 20 కిలోమీటర్ల మేర మాత్రమే అధ్యయనం చేశారని పేర్కొన్నారు. ఇదే ప్రాంతంలో మృగవాణి జాతీయ పార్కు కూడా ఉందని తెలిపారు.
ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరిసరాల్లో భారీ నిర్మాణాలు చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంపైనా రిటైర్డ్ ఇంజినీర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. వాణిజ్య సముదాయాల ఏర్పాటుపైనా అభ్యంతరాలు లేవనెత్తారు. ప్రాజెక్టు వల్ల పర్యావరణంపై పడే ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పిటిషనర్లు వాదించారు.
పిటిషన్‌ను పరిశీలించిన ఎన్జీటీ.. ప్రతివాదిగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. పర్యావరణ అనుమతుల జారీ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన వివరాలను ట్రిబ్యునల్‌కు సమర్పించాలని ఆదేశించింది. ఈ అంశంపై ప్రభుత్వం తన వాదన వెల్లడించాల్సి ఉంది.
మూసీ ప్రాజెక్టుపై గతంలోనూ ఎన్జీటీలో న్యాయపరమైన వివాదం కొనసాగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను ఎన్జీటీ కొట్టివేసింది. ఇప్పుడు మరో పిటిషన్ దాఖలు కావడంతో ఈ వ్యవహారం మళ్లీ చర్చనీయాంశంగా మారింది. రిటైర్డ్ ఇంజినీర్లు దాఖలు చేసిన అప్పీల్‌పై తదుపరి విచారణను ఎన్జీటీ అక్టోబర్ 16కు వాయిదా వేసింది. ఆ విచారణలో పిటిషనర్లు లేవనెత్తిన పర్యావరణ అభ్యంతరాలు, రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే వివరణలు కీలకం కానున్నాయి. ఇప్పటికే మూసీ ప్రక్షాళనను ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఎన్జీటీలో తాజా పరిణామం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.

## వారితోనే స్నేహం చేయాలి

**ముద్ర ఢిల్లీ:**
బ్రిక్స్ సదస్సుకోసం దేశ రాజధాని దిల్లీ ముస్తాబయింది. అతిథుల రాక మొదలైంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ప్రపంచ సంక్షేమం కోసం ఈ సదస్సులో సానుకూల చర్చలు జరుగుతాయనే విశ్వాసాన్ని వ్యక్తంచేశారు. ''బ్రిక్స్ సదస్సు కోసం ఈ రెండు మూడు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న పలు దేశాల నేతలు భారత్‌లో పర్యటిస్తారు. ప్రపంచ సంక్షేమాన్ని కాంక్షిస్తూ వివిధ అంశాలపై అర్థవంతమైన చర్చలు జరుగుతాయనే నమ్మకం ఉంది. సద్గుణాలు కలిగిన వారితోనే మాట్లాడాలి. వారితో కలిసి పనిచేయాలి. చర్చలు, స్నేహమూ వారితోనే ఉండాలి. దుర్గుణాలు కలిగినవారికి దూరంగా ఉండాలి'' అని పోస్టులో మోదీ రాసుకొచ్చారు.
కాగా.. శని, ఆదివారాల్లో దిల్లీలో బ్రిక్స్ కూటమి 18వ శిఖరాగ్ర సదస్సు జరగనుంది. దీని కోసం భారత్‌కు వచ్చే పలువురు నాయకులతో మోదీ నేడు ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 12.09.2026
www.mudranews.in | @mudranews



## విటమిన్-సి ఉండే ఆహారం

ఉసిరి, జామ, నిమ్మ, బత్తాయి, టమాటాలను తరచుగా తీసుకోవాలి. వీటిలోని విటమిన్-సి రోగనిరోధక వ్యవస్థ సక్రమంగా పని చేయడానికి తోడ్పడుతుంది.




# చెరువుల హద్దులకు రక్షణ కవచం

**మత్స్యకారుల బతుకులకు భరోసా.. ఎఫ్‌టీఎల్ పరిరక్షణపై రాజీ లేదు**
**అన్ని చెరువులకు పరిరక్షణ కమిటీలు.. 44 వేల చెరువులకు జియో ట్యాగింగ్**
**నెల్లికల్ ప్రాజెక్టు 2027 డిసెంబర్ నాటికి పూర్తి: మంత్రి ఉత్తమ్**

**ముద్ర, హైదరాబాద్** : చెరువులు, కుంటలు, ఇతర జలవనరుల పరిరక్షణతోపాటు వాటిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుల జీవనోపాధిని కాపాడటానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) హద్దులను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుతామని, ఆక్రమణలను ఉపేక్షించబోమని శాసనమండలిలో స్పష్టం చేశారు. సభలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. చెరువుల పర్యవేక్షణలో మత్స్య సహకార సంఘాలకు కీలక పాత్ర కల్పించాలని సభ్యులు కోరారు. రాష్ట్రంలో మత్స్య సహకార సంఘాలు 2,150 నుంచి 6 వేలకు పైగా పెరగగా, సభ్యత్వం సుమారు 2 లక్షల నుంచి 6.5 లక్షలకు చేరిందని తెలిపారు.


అన్ని చెరువులకు పరిరక్షణ కమిటీలు

రాష్ట్రంలోని అన్ని చెరువులకు పరిరక్షణ, నిర్వహణ కమిటీల ఏర్పాటుకు ప్రక్రియ ప్రారంభమైందని మంత్రి వెల్లడించారు. ఆక్రమణల నిరోధం, నిరంతర పర్యవేక్షణ కోసం ఈ కమిటీలను పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సుమారు 44 వేల చెరువులకు జియో ట్యాగింగ్ పూర్తయిందన్నారు. చెరువుల సంరక్షణకు అదనపు నిధులు అవసరమైతే ప్రభుత్వం సమకూర్చేందుకు వెనుకాడదని స్పష్టం చేశారు.

**నెల్లికల్ ప్రాజెక్టుపై హామీ**

నల్లగొండ జిల్లాలోని నెల్లికల్ ఎత్తిపోతల పథకాన్ని డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేసి మొత్తం 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. తొలి దశలో జూన్ 2027 నాటికి 7,800 ఎకరాలకు నీరు అందిస్తామని, మిగిలిన సుమారు 16 వేల ఎకరాలకు డిసెంబర్ నాటికి సాగునీరు అందిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం ఈ పథకానికి రూ.25.42 కోట్లు మాత్రమే విడుదల చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు రూ.310.681 కోట్లు విడుదల చేసిందని మంత్రి పేర్కొన్నారు. ప్రాజెక్టు పనులను తాను రెండుసార్లు క్షేత్ర స్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు.

**పీడీఎస్‌లో అదనపు సరుకులపై పరిశీలన**

ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా బియ్యం, గోధుమలు, చక్కెరతోపాటు పప్పులు, వంట నూనెల వంటి మరిన్ని నిత్యావసర సరుకులు పంపిణీ చేసే ప్రతిపాదనను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి చెప్పారు. దీనికి అయ్యే ఆర్థిక భారాన్ని అంచనా వేస్తున్నామని తెలిపారు. పేదలకు ఆహార భద్రతతోపాటు పోషక భద్రత కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు ఉత్తమ్ వెల్లడించారు.

## పర్యావరణ హితైషి మట్టి గణపతి

**- బోడుప్పల్ డిప్యూటీ కమీషనర్ శైలజ**



**ముద్ర, బోడుప్పల్:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో పర్యావరణ పరిరక్షణలో భాగంగా పర్యావరణహిత మట్టి గణేష్ విగ్రహాలను బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులకు డిప్యూటీ కమిషనర్ ఏ. శైలజ పంపిణీ చేశారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం, కాలుష్య నియంత్రణ మండలి నుంచి బోడుప్పల్ సర్కిల్ కు మొత్తం 4,932 పర్యావరణహిత మట్టి గణేష్ విగ్రహాలు అందాయి. వీటిలో 8 అంగుళాల విగ్రహాలు 3,933, 12 అంగుళాల విగ్రహాలు 666, 15 అంగుళాల విగ్రహాలు 333 ఉన్నాయి. వీటిని ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని మట్టి గణేష్ విగ్రహాలను వినియోగించి పర్యావరణహితంగా వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్డబ్ల్యూఎం అసిస్టెంట్ ఇంజనీర్ మహేష్ తోపాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. పీర్జాదిగూడ. మేడిపల్లి ప్రాంతాల కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధుల సౌకర్యార్థం శనివారం ఉదయం 9:30 గంటల నుంచి పీర్జాదిగూడ కౌన్సిల్ హాల్ లో పర్యావరణహిత మట్టి గణేష్ విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు డిప్యూటీ కమిషనర్ శైలజ తెలిపారు. సంబంధిత కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పర్యావరణహిత గణేష్ విగ్రహాలతో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించాలని కోరారు.

## బీసీల కులగణన చేపట్టాలి

**- మంత్రి వాకిటి శ్రీహరి**

**ముద్ర, హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీల కులగణనను తప్పనిసరిగా చేర్చాలని మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. అసెంబ్లీలో శుక్రవారం కులగణనపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. బీసీల రిజర్వేషన్లు దానం కాదని, సామాజిక న్యాయం కోసం దశాబ్దాల పోరాటం ఫలితమని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల సర్వే సామాజిక న్యాయానికి పునాది అని పేర్కొన్నారు. బీసీల జనాభా, సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై ఖచ్చితమైన గణాంకాలు ఉంటేనే వారికి తగిన వాటా కల్పించగలమన్నారు. "జిత్నీ ఆబాదీ.. ఉత్నా హక్" నినాదంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. బీసీలను లెక్కించి, వారికి న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## రైతుకు నచ్చిన యంత్రం.. నచ్చిన కంపెనీ నుంచే కొనుగోలు

**ముద్ర, హైదరాబాద్:** రైతుల అవసరాలు, డిమాండ్‌కు అనుగుణంగా వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలు చేస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. శుక్రవారం శాసనమండలిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. రైతు తనకు నచ్చిన పనిముట్టును, నచ్చిన కంపెనీ నుంచి కొనుగోలు చేసుకునే స్వేచ్ఛ కల్పించామని చెప్పారు. యంత్రాల కొనుగోలుపై ఇచ్చే సబ్సిడీని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని వెల్లడించారు. చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు 50 శాతం, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు. 2025-26లో రూ.63.11 కోట్లతో 15,565 యంత్ర పరికరాలు సరఫరా చేశామని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.147.91 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన యంత్రాలు అందించేందుకు 444 కంపెనీల ఎంప్యానెల్‌మెంట్ దరఖాస్తులను పరిశీలిస్తున్నామని చెప్పారు. డ్రోన్లు సహా ఆధునిక పరికరాలకు డిమాండ్ మేరకు ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి తెలిపారు.

## హరిత విద్యుత్ విప్లవమే లక్ష్యం

**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా పర్యావరణహిత హరిత ఇంధనాన్ని ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శాసనమండలిలో సభ్యుల ప్రశ్నలకు సమాధానమిస్తూ తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025 వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ 19,543 మెగావాట్లకు చేరిందని, ఈ ఏడాది 20–21 వేల మెగావాట్లకు పెరగవచ్చని చెప్పారు. పీఎం-కుసుమ్ పథకం కింద 2,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి రైతులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ పంప్‌సెట్లు, గృహ విద్యుత్ సబ్సిడీల కోసం ఏటా దాదాపు రూ.19 వేల కోట్లు ఖర్చవుతున్నాయని, సోలరైజేషన్ ద్వారా ఈ భారాన్ని తగ్గించడంతోపాటు రైతులను స్వయంసమృద్ధి దిశగా తీసుకెళ్లవచ్చన్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో బ్యాటరీ స్టోరేజ్‌తో మైక్రో గ్రిడ్లను పైలట్ ప్రాజెక్టులుగా చేపడుతున్నామని భట్టి వెల్లడించారు.

## ఉద్యోగులకు కోటి రూపాయల ఉచిత ప్రమాద బీమా



**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి రూపాయి ప్రీమియం లేకుండా రూ.కోటి వరకు ఉచిత ప్రమాద బీమా కల్పిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. శాసనమండలిలో సభ్యుల ప్రశ్నలకు సమాధానమిస్తూ, జీవో నంబర్ 77 ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో 12.91 లక్షల మందికి ఈ బీమా వర్తిస్తుందని వెల్లడించారు. ఇప్పటికే ప్రమాదాల్లో మృతి చెందిన 89 మంది ఉద్యోగుల కుటుంబాలకు బీమా పరిహారం అందించినట్లు తెలిపారు. ఇందులో సింగరేణి ఉద్యోగులు 50 మంది, విద్యుత్ శాఖ ఉద్యోగులు 15 మంది, ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులు 24 మంది ఉన్నారని వివరించారు. ప్రమాద మరణం, శాశ్వత వైకల్యంతో పాటు విమాన ప్రమాదాలకు రూ.2.20 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు కవరేజ్ లభిస్తుందని చెప్పారు. ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు.

## పాడి రంగం బలోపేతానికి చర్యలు

**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్రంలో పాడి పరిశ్రమను బలోపేతం చేసి, రైతులకు మెరుగైన ఆదాయం కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. శుక్రవారం శాసనసభలో సభ్యుల ప్రశ్నలకు సమాధానమిచ్చిన ఆయన.. 2025–26లో రాష్ట్రంలో 61.75 లక్షల టన్నుల పాల ఉత్పత్తి నమోదైందన్నారు. పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, మధిర, కొడంగల్ నియోజకవర్గాల్లో సెర్ప్ భాగస్వామ్యంతో పాడి గేదెల పంపిణీ చేపడుతున్నట్లు వెల్లడించారు. గోపాలమిత్రలకు మెడిక్లెయిమ్, ప్రమాద బీమా, గౌరవ వేతనం, శిక్షణ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. పశుసంవర్ధక శాఖలో 1,100 మందికిపైగా ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చి, బదిలీలను పారదర్శకంగా నిర్వహించామన్నారు. కర్ణాటక నందిని కంటే విజయ డెయిరీ ద్వారా రైతులకు అధిక ధర చెల్లిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

## బీసీ జనగణనపై అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయాలి



**ముద్ర, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా బీసీల జనాభా గణాంకాలను కచ్చితంగా సేకరించేందుకు కుల ఆధారిత జనగణన చేపట్టాల్సిన అవసరం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీసీలకు సంబంధించిన ఈ అంశంపై తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని ఆయన కోరారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి చెందిన సభ్యులు కూడా బీసీల సమస్యలపై రాష్ట్ర అసెంబ్లీ తీసుకునే నిర్ణయానికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బీసీల సామాజిక న్యాయం, విద్యా అవకాశాలు, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యానికి కచ్చితమైన జనాభా గణాంకాలు ఎంతో అవసరమని మంత్రి పేర్కొన్నారు. కుల ఆధారిత జనగణన ఎందుకు అవసరమో ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని సూచించారు. గతంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన జనగణనలో ఓబీసీలకు ఎస్సీ, ఎస్టీల మాదిరిగా ప్రత్యేక గుర్తింపు ఇవ్వకుండా ఓపెన్ కాలమ్ విధానం అమలు చేయడంతో కచ్చితమైన గణాంకాల సేకరణలో ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపారు. కులాల పేర్లు, వివరాలను స్పష్టంగా నమోదు చేయకపోవడం వల్ల ఓబీసీల వాస్తవ జనాభా, వారి సామాజిక, ఆర్థిక అవసరాలను అంచనా వేయడం కష్టమైందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక గుర్తింపు కల్పించి, జనగణన షెడ్యూల్‌లో ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని కోరారు.

తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే ద్వారా రాష్ట్రంలోని బీసీల వాస్తవ పరిస్థితిని గుర్తించే ప్రయత్నం చేసిందని పొన్నం ప్రభాకర్ చెప్పారు. ముందుగానే కులాల జాబితాలను రూపొందించి సర్వే నిర్వహించడం వల్ల కచ్చితమైన గణాంకాలను సేకరించడం సాధ్యమైందన్నారు. ఈ గణాంకాల ఆధారంగా బీసీలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చట్టపరమైన చర్యలు చేపట్టిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారిక రికార్డుల్లో ఉన్న కులాల వివరాలను డిజిటల్ పోర్టల్‌లో నమోదు చేయాలని మంత్రి సూచించారు. కచ్చితమైన కుల గణాంకాల ఆధారంగా సంక్షేమ పథకాలు, విద్యా అవకాశాలు, ఉద్యోగాలు, రిజర్వేషన్లను సమర్థవంతంగా అమలు చేయవచ్చన్నారు. దేశ వ్యాప్తంగా బీసీలకు న్యాయం జరిగేలా కుల గణనను శాస్త్రీయంగా, పారదర్శకంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సామాజిక, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి వర్గానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. భవిష్యత్తు తరాలకు సంబంధించిన ఈ కీలక అంశంపై కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తరఫున ఈ తీర్మానాన్ని సభలో ప్రవేశపెడుతున్నామని, ప్రభుత్వం తరపున కూడా తీర్మానాన్ని ప్రవేశపెట్టి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని నిర్ణయించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. కచ్చితమైన బీసీ గణాంకాలు ఉంటేనే సామాజిక న్యాయం కోసం సమర్థవంతమైన విధానాలను రూపొందించడం సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు.

## రూ. 180 కోట్ల ఓవర్సీస్ స్కాలర్‌షిప్ నిధులు విడుదల!

**ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలతో నిధులు రిలీజ్**
**లబ్ధి పొందిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గానికి చెందిన 3,008 మంది విద్యార్థులు**



**ముద్ర, హైదరాబాద్** : విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న తెలంగాణ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఓవర్సీస్ స్కాలర్‌షిప్ నిధులను శుక్రవారం రూ.179.90 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిధులను త విడుదల చేసినట్లు ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. తాజా నిధుల విడుదలతో విదేశాల్లో చదువుకుంటున్న మొత్తం 3,008 మంది విద్యార్థులకు భారీ ఆర్థిక ఊరట లభించిందని, స్కాలర్‌షిప్ మంజూరైన లబ్ధిదారులందరికీ చెల్లింపులు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ నిధుల కేటాయింపుల్లో భాగంగా ఎస్సీ వర్గానికి చెందిన 1,193 మంది విద్యార్థులకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి కింద రూ.48.42 కోట్లు విడుదలయ్యాయి. అలాగే ఎస్టీ వర్గానికి చెందిన 573 మంది విద్యార్థులకు రూ.36.95 కోట్లు, బీసీ సామాజిక వర్గానికి చెందిన 179 మంది విద్యార్థులకు మహాత్మా జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యానిధి కింద రూ.18.41 కోట్లు మంజూరు చేశారు. మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన 1,063 మంది విద్యార్థులకు ముఖ్యమంత్రి ఓవర్సీస్ విద్యానిధి కింద రూ.76.13 కోట్ల రూపాయలను విడుదల చేశారు. పేద, ప్రతిభావంతులైన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు లేకుండా అంతర్జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాలలో ఉన్నత చదువులు అభ్యసించాలనే దృఢ సంకల్పంతోనే ప్రభుత్వం ఈ నిధులను విడుదల చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బీహార్ అధికారులకు సీఎం ప్రజావాణి స్ఫూర్తి

**ముద్ర, హైదరాబాద్:** సీఎం ప్రజావాణి కార్యక్రమం అమలు తీరును బీహార్ రాష్ట్రానికి చెందిన 120 మంది గ్రూప్-1 అధికారుల బృందం శుక్రవారం ప్రజాభవన్‌లో పరిశీలించింది. రాష్ట్ర ప్రణాళికా మండలి వైస్ చైర్‌పర్సన్, సీఎం ప్రజావాణి ఇన్‌చార్జ్ గద్వాల్ విజయలక్ష్మితో అధికారులు భేటీ అయ్యారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించడం, సంబంధిత శాఖలకు పంపించడం, పరిష్కారాలను పర్యవేక్షించే విధానాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సమస్యలపై అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సీఎం ప్రజావాణి తమకు స్ఫూర్తినిచ్చిందని, బీహార్‌లోని ప్రజా దర్బార్ వ్యవస్థలోనూ ఇలాంటి మార్పులు తీసుకురావడానికి ప్రయత్నిస్తామని అధికారులు తెలిపారు. ప్రజావాణి ద్వారా సమస్యల పరిష్కారంలో 74 శాతం సక్సెస్ రేట్ సాధించామని విజయలక్ష్మి వెల్లడించారు.

## ఉద్యోగులకు డిజిటల్ హెల్త్ కార్డులు

**ముద్ర, హైదరాబాద్** : ఉద్యోగులకు డిజిటల్ హెల్త్ కార్డులు అందజేసే ప్రక్రియను వేగవంతంగా అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం, ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈహెచ్ఎస్ సమర్థవంతమైన నిర్వహణ కోసం ప్రత్యేక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులను అందులో భాగస్వాములుగా చేర్చామని చెప్పారు. ఈహెచ్ఎస్ ట్రస్ట్ ఖాతాలో రూ.264 కోట్ల కార్పస్ ఫండ్‌ను జమ చేసినట్లు వెల్లడించారు.

## అటవీ అమరవీరుల సేవలు చిరస్మరణీయం

**ముద్ర, హైదరాబాద్** : అడవులు, వన్యప్రాణుల సంరక్షణలో ప్రాణత్యాగం చేసిన అటవీశాఖ సిబ్బంది సేవలు చిరస్మరణీయమని డీజీపీ సి.వి. ఆనంద్ అన్నారు. అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా నెహ్రూ జూలాజికల్ పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అమరవీరులకు నివాళులర్పించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 23 మంది అటవీ సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అటవీ భూముల ఆక్రమణలను అడ్డుకునేందుకు కలెక్టర్లు, ఎస్పీలు, అటవీశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అటవీ సిబ్బందికి అవసరమైన ఆయుధాలు అందిస్తే మరింత సమర్థంగా విధులు నిర్వహించగలరన్నారు.

అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. అక్రమ కలప రవాణా, వన్యప్రాణుల వేటను అడ్డుకునే క్రమంలో అటవీ సిబ్బంది ప్రాణాలకు ముప్పు ఎదురవుతోందన్నారు. అడవుల నరికివేతను అరికట్టి పర్యావరణ సమతుల్యతను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వైరా శాసనసభ సభ్యులు రాందాస్ నాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ వినయ్‌కుమార్,టీజీఎఫ్‌డీసీ వైస్ చైర్మన్, ఎండీ సునీత ఎం. భగవత్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల, సెక్రటరీ ప్రియాంక వర్గీస్, పోలీసు, అటవీ శాఖ అధికారులు, అమరవీరుల కుటుంబాలు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
శనివారం 12.09.2026



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com




## బంగ్లాదేశ్ ఓడింది..
# నేపాల్‌లో గెలిచింది
## కారణం ఇదే!

జెన్ జీ.. జెన్ జెడ్.. యువ తరంగం.. పేరు ఏదైనా అంతా ఒక్కటే. రెండేళ్లుగా ఏ ఉద్యమం జరిగినా.. అందులో ముందుగా వినిపించే పదం జెన్ జీ. పెరుగుతున్న నిరుద్యోగం.. పేదరికం.. జనాభా.. పాలకుల్లో పెరుగుతున్న నిర్లక్ష్యం, అవినీతి వెరసి ఉరకలేసే ఉడుకు రక్తం యువ తరంగంలా తిరగబడుతోంది. అన్యాయంపై పోరాడుతోంది. శ్రీలకంతో జెన్‌జీ ఉద్యమం మొదట తెరపైకి వచ్చింది. తర్వాత బంగ్లాదేశ్, గతేడాది నేపాల్‌లో జెన్‌జీ ఉద్యమాలు జరిగాయి. కారణాలు వేరే అయినా పోరాటంలో ముందు ఉంది జెన్‌జీ. ఇక ఈ ఉద్యమాల తర్వాత జెన్‌జీ రాజకీయంగాను యాక్టివ్ అవుతోంది. జెన్ జీ ఉద్యమాలు శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో ప్రభుత్వాలను కూల్చాయి. తర్వాత జరిగిన ఎన్నికల్లో బంగ్లాదేశ్, నేపాల్‌లో జెన్‌జీ పోటీ కూడా చేసింది. అయితే బంగ్లాదేశ్ ప్రజలు జెన్‌జీని ఆదరించలేదు. నేపాలీలు మాత్రం అధికారం కట్టబెట్టారు.

**షేక్ హసీనా ప్రభుత్వం కూల్చివేత..**
2024లో హసీనా షేక్ ప్రభుత్వం కూలడానికి జెన్‌జీ (1997–2012 మధ్య జన్మించిన యువత) నిరసనాలు ముఖ్య కారణం. కొట్టా క్వోటా వ్యవస్థపై ప్రారంభమైన ఆందోళనలు అవినీతి, మానవహక్కుల ఉల్లంఘనలపై విస్తరించాయి. ఇది 'జులై విప్లవం'గా పేరొందింది. ఈ ఉద్యమ నాయకులు స్టూడెంట్లు నహిద్ ఇస్లాం, హస్నాత్ అఫ్తాబ్, అబ్దుల్లా అఖ్తర్ నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్ఎస్‌పీ) ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో పోటీ చశారు. కానీ ఒక్క సీటు కూడా గెలవలేదు.



**ఓటమికి కారణాలు..**
బంగ్లాదేశ్ ఎన్నికల్లో జెన్‌జీ ఏర్పాటు చేసిన నేషనల్ సిటిజన్ పార్టీ ఓటమికి అనేక కారణాలు ఉన్నాయి. ఉద్యమం తర్వాత కూడా అనేక హింసాత్మక ఘటనలు జరగడం ప్రజల్లో వ్యతిరేకత పెంచింది. కొత్తగా పార్టీ పెట్టడంతో ప్రజల్లో నమ్మకం పెరగలేదు. మేనిఫెస్టో విధానాలు కూడా ప్రజలను నమ్మించేలా లేవు. పార్టీ స్థాపించినవారెవరికీ రాజకీయ అనుభవం లేకపోవడం, పార్టీ పెట్టిన కొన్నాళ్లకే అంతర్గత విభేదాలు తలెత్తడం కూడా ఓటమికి కారణం. ఇక మరో ప్రధాన లోపం ఉద్యమంలో కనిపించిన ఉత్సాహం ఎన్నికల ప్రచారంలో కనిపించలేదు.

**నేపాల్‌లో జెన్ జీ విప్లవం..**
నేపాల్‌లో కేపీ శర్మ ఒలి ప్రభుత్వం 2024లో టిక్‌టాక్‌పై నిషేధం విధించడంతో యువత కోపం రగిలింది. నిషేధానికి ప్రధాన కారణం మంత్రులు, నేతల పిల్లలు ఈ టిక్‌టాక్‌లో ఖరీదైన దుస్తులు ధరించి రీల్స్ చేయడం. స్టార్ హోటళ్లలో గడపడం, విదేశీ టూర్లకు వెళ్లడం వంటి వీడియోలు ఉన్నాయి. వీటిపై అప్పటికే కోపంగా ఉన్న యువత టిక్‌టాక్ నిషేధంతో మరింత రగిలింది. ఇది అవినీతి, ఆర్థిక సమస్యలపై విస్తరించి 'జెన్‌జీ రిబెలియన్'గా మారింది. ర్యాపర్ బాలెన్ షా(బాలేన్) ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు.

**యువతలో ఉత్సాహం నింపిన షా..**
నేపాల్ జెన్‌జీ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన బాలెన్ షా.. ఉద్యమం ఉవ్వెత్తున ఎగసేలా యువతలో తన పాటలతో ఉత్సాహం, ఉద్రేకం, కోపం నింపారు. పాటల రూపంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. యూట్యూబ్‌లో మిలియన్ల కొద్ది వీక్షణలు వచ్చాయి. ఇక షా 2022లో జరిగిన కాఠ్మండు మున్సిపల్ మేయర్‌గా స్వంతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలిచాడు. రోడ్లు, వ్యర్థాల నిర్వహణలో సంస్కరణలు తీసుకొచ్చారు. తర్వాత రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్ఎస్‌పీ)లో చేరి, 2024 ఎన్నికల్లో 21 సీట్లు సాధించారు. యువత ఓటు బ్యాంక్ (40% ఓటర్లు 18–35 ఏళ్లు) కీలకం.

**విజయ కారణాలు..**
నేపాల్‌లో ఆర్ఎస్‌పీ విజయానికి కారణం హింస లేకుండా సోషల్ మీడియాను కళాత్మకంగా ఉపయోగించుకున్నారు. స్థానిక సమస్యలపై (ట్రాఫిక్, శుభ్రత) తక్షణ చర్యలు తీసుకున్నారు. మేయర్ పదవి ద్వారా రాజకీయ నైపుణ్యం పెంచుకున్నారు. దీంతో తాజాగా జరిగిన నేపాల్ పార్లమెంటు ఎన్నికల్లో పార్టీని ప్రజలు నమ్మారు. యువత అధికారంలోకి వస్తే దేశ భవిత మారుతుందని భావించారు. ఆర్ఎస్‌పీకి పట్టం కట్టారు.

## పాకిస్తాన్‌లో జన్-జీ
# రోడ్డెక్కడం లేదు
## మోడీపై పాక్ చర్చ



ఢిల్లీలో ఇటీవల కొంతమంది యువతీయువకులు కాక్రోచ్ జనతా పార్టీ పేరిట నీట్ ప్రశ్నపత్ర లీక్, విద్యా వ్యవస్థలోని లోపాలపై సుమారు మూడు వారాలపాటు నిరసన వ్యక్తం చేశారు. పార్లమెంటు సమావేశాలు ప్రారంభమైన తర్వాత వారు రాజకీయ నాయకులతో కలిసి పార్లమెంటు సమీపంలో ఉద్రిక్తత సృష్టించే ప్రయత్నం చేశారు. సోషల్ మీడియా రీల్స్ ద్వారా ప్రభుత్వంపై తీవ్రమైన భాషలో విమర్శలు చేయడం, వ్యక్తిగత స్థాయిలో అసభ్య వ్యాఖ్యలు కనిపించింది. వీరు తమను విద్యార్థులు, జెన్‌జీగా అభివర్ణించుకున్నారు.

**వ్యక్తిగత దాడులు..**
ఇలాంటి వ్యక్తిగత, అసభ్య విమర్శలపై తక్షణం కఠిన చర్యలు తీసుకుంటారని, పోలీసులు లేదా సైన్యం రంగంలోకి దిగుతారని కొందరు భావించారు. అయితే ప్రధాని మోదీ ప్రభుత్వం వ్యక్తిగత దూషణలను పట్టించుకోలేదు. దేశ భద్రత, సార్వభౌమత్వం వంటి అంశాలపై విమర్శలు వచ్చినప్పుడు మాత్రమే స్పందించే విధానం కనిపిస్తోంది. అనుమతి లేకుండా పార్లమెంటు సమీపంలో జరిగిన ఉద్రిక్తతను సంయమనంతో ఎదుర్కొని, బాడీ కెమెరాలు, ఇతర ఆధారాల ఆధారంగా తర్వాత చర్యలు తీసుకున్నారు. నాయకులతో చర్చలు జరిపి ఉద్యమాన్ని శాంతియుతంగా ముగించే దిశగా కృషి చేశారు. ఢిల్లీతోపాటు ఇతర ప్రాంతాల్లో కొంతమంది యువకులు, రాజకీయ నాయకులపై చట్టపరమైన చర్యలు కూడా జరిగాయి. ఇది ఒకవైపు సంభాషణ, మరోవైపు చట్టపరమైన బాధ్యత అనే రెండు విధానాల మిశ్రమం.

**రెచ్చగొట్టే ప్రయత్నాలు**
పాకిస్తాన్ నుంచి కొందరు హిందూ పేర్లతో రెచ్చగొట్టే కంటెంట్‌ను విస్తృతంగా పంపి, పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేసి భారత్‌లో కఠిన చర్యలు జరగాలని ఆశించారు. అయితే భారత ప్రభుత్వం అలాంటి ఉచ్చులో పడకుండా పరిపక్వంగా వ్యవహరించింది. యువత భారతీయులే కాబట్టి వారితో సమన్వయం ముఖ్యమనే విధానం అనుసరించింది.

**పాకిస్తాన్‌లో విమర్శ..**
పాకిస్తాన్‌లో ప్రధాని, సైన్యాధిపతి లేదా మంత్రులపై విమర్శలు చేస్తే కఠిన చర్యలు సాధారణం. అక్కడి ప్రముఖ జర్నలిస్టులు, వ్యాఖ్యాతలు కూడా సైన్యం గురించి మాట్లాడటానికి జాగ్రత్తపడతారు. విమర్శలకు బంధువులను లక్ష్యంగా చేసుకోవడం, శారీరక దాడులు వంటివి జరిగిన ఉదాంతాలు ఉన్నాయి. దీని ఫలితంగా పాకిస్తాన్ జెన్‌జీ రోడ్డుపైకి వచ్చి నిరసన వ్యక్తం చేసే సాహసం చూపదు. సైన్యం ఆధిపత్యం కారణంగా అక్కడ ఉద్యమాలు త్వరగా అణచివేయబడతాయి.

**రెండు దేశాల మధ్య తేడా..**
భారత్‌లో ప్రధానిని విమర్శించినా చర్చలు జరుపుతూ, అవసరమైన చోట చట్టపరమైన చర్యలు తీసుకుంటూ ఉద్యమాన్ని నిర్వహించిన తీరు పాకిస్తాన్ మేధావులు, యువతలో చర్చనీయాంశంగా మారింది. భారత్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థలో సంయమనం, చట్ట పాలన, సంభాషణకు అవకాశం ఉంది. పాకిస్తాన్‌లో మాత్రం నిరసనకారులతో మాట్లాడే భాష కేవలం బలప్రయోగంగా మారుతుంది. దీని వల్ల అక్కడ జెన్‌జీ ఉద్యమాలు బలంగా రూపుదిద్దుకోవడం కష్టం.

ఈ ఘటన భారత ప్రజాస్వామ్యం పరిపక్వతను, వ్యక్తిగత విమర్శలను విస్మరించి జాతీయ ప్రయోజనాలపై దృష్టి సారించే విధానాన్ని చూపిస్తుంది. అదే సమయంలో చట్టం అమలు చేయడంలో సమతూకం పాటించిన తీరు కూడా గమనార్హం.



## ప్రపంచాన్ని షేక్ చేసిన
# యువత తరంగం!

జెన్ జీ.. ఏడాది కలాంగా బలంగా వినిపిస్తున్న పదం.. ఇక ప్రస్తుత సమాజం సోషల్ మీడియాను విపరీతంగా ప్రభావితం చేస్తోంది. జెన్ జీ, సోషల్ మీడియా రెండూ కలిసి 2025లో ప్రపంచాన్ని షేక్ చేశాయి. టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌ను ఉపయోగించి అవినీతి, నిరుద్యోగం, ప్రభుత్వ సేవల లోపాలపై దాడి చేసింది. 18–25 ఏళ్ల వారు షార్ట్ వీడియోలు, మీమ్‌లతో లక్షలాది మందిని ఉత్తేజపరిచారు. ఏఐ జనరేటెడ్ గ్రాఫిక్స్, లైవ్ స్ట్రీమ్‌లు ప్రజల్లో కోపాన్ని రగిల్చాయి. ఫలితంగా, డిజిటల్ క్యాంపెయిన్‌లు అందరినీ రోడ్లపైకి వచ్చేలా చేశాయి. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ప్రభుత్వాలను మార్చేశారు. కొన్ని ప్రభుత్వాలు తలవంచేలా చేశారు.

**నేపాల్‌లో అవినీతి వ్యతిరేక ఉద్యమం..**
నేపాల్‌లో జూన్‌లో మొదలైన #YouthAgainst Corruption హ్యాష్‌ట్యాగ్ 5 కోట్ల వ్యూస్ సాధించింది. ఆర్థిక మంత్రి అవినీతి ఆరోపణలు, 40% యువత నిరుద్యోగం ప్రదర్శనలకు కారణం. కాఠ్మాండూలో 2 లక్షల మంది రోడ్లెక్కారు, ప్రధాని రాజీనామా చేశారు. కొత్త యువ నాయకుడు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, ఉద్యోగాలు, అవినీతి విచారణలు ప్రారంభించారు.

**మడగాస్కర్‌లో ఫుడ్ రెవల్యూషన్..**
ఆఫ్రికా ద్వీపం మడగాస్కర్‌లో #FoodRevolution-Madagascar క్యాంపెయిన్ ఆహార ధరలు, వ్యవసాయ వైఫల్యాలపై దృష్టి సారించింది. 60% యువత ఆదాయం లేకుండా ఉన్న సందర్భంలో, అంటిమెద్దిరోలో 1.5 లక్షల మంది ప్రదర్శించారు. ప్రభుత్వం కుదిపోయి, అంతర్జాతీయ సహాయం కోరింది. జెన్–జీ నేతలు పార్లమెంట్‌లో 30% సీట్లు సాధించారు.

**మరాకోలో రాజకీయ మలుపు**
మరాకోలో #ChababMaghreb (యువత మఘ్రెబ్) ట్రెండ్ 3 నెలల్లో 8 కోట్ల ఇంటరాక్షన్స్ పొందింది. 35% నిరుద్యోగం, యువతకు ఉద్యోగాలు లేకపోవడం ప్రధాన కారణం. రబాత్, కాసబ్లాంకాలో ప్రదర్శనలు రాజకీయ సంస్కరణలకు దారితీశాయి. ప్రభుత్వం కొత్త యువ మంత్రిని నియమించి, డిజిటల్ ఉద్యోగాలు ప్రవేశపెట్టింది.

**మెక్సికోలో చీటకి చట్టాలపై విజయం..**
మెక్సికోలో #NoMasImpunidad (ఇక చీకటి చట్టాలు కాదు) డ్రగ్ మాఫియా, పోలీస్ అవినీతిపై లక్షలాది మందిని కలిపింది. మెక్సికో సిటీలో 5 రోజుల ప్రదర్శనలు అధ్యక్షుడినే మార్చేశాయి. ఎన్నికల్లో జెన్–జీ అభ్యర్థి 52% ఓట్లతో విజయం సాధించి, యువత పాలసీలను అమలు చేస్తోంది.

**ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక, సామాజిక మార్పులు**
ఈ ఉద్యమాలు 12 దేశాల్లో ప్రభుత్వ మార్పులకు దారితీశాయి, 50 బిలియన్ డాలర్ల ఆర్థిక నష్టం సృష్టించాయి. పాజిటివ్‌గా, యువ నాయకులు పార్లమెంట్లలో 25% పెరిగారు. పర్యావరణం, మెంటల్ హెల్త్ అజెండాలు ముందుకు వచ్చాయి. అయితే, కొన్ని చోట్ల అల్లర్లు, ఇంటర్నెట్ షట్‌డౌన్‌లు జరిగాయి. ఫ్రాన్స్, ఇండియా వంటి దేశాలు సోషల్ మీడియా రూల్స్ రూపొందిస్తున్నాయి. ఈయూ డిజిటల్ యువత ఫోరమ్ ఏర్పాటు చేసింది. ప్రభుత్వాలు యువతతో డైలాగ్ ప్లాట్‌ఫామ్‌లు మొదలుపెట్టాయి.

2030 నాటికి జెన్–జెడ్ 40% ఓటర్లుగా మారి, ఎన్నికలు, పాలసీలను ఆకారం ఇస్తారు. డిజిటల్ డిమాక్రసీ కొత్త మోడల్‌గా ఎదుగుతోంది. ప్రభుత్వాలు యువత డిమాండ్లను పట్టుకోకపోతే, మరిన్ని దేశాల్లో సంక్షోభాలు రావచ్చు. ఇది కొత్త యుగం ప్రారంభమే.

## యువత కోసం
# ఆర్ఎస్ఎస్ ఆరాటం

ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు ఎక్కడ చూసినా జెన్‌జీ, జెన్ ఆల్ఫా గురించి మాటలే. 25 ఏళ్ల లోపు వయసున్న తరం దేశ భవిష్యత్తును నిర్ణయించేవారు అనే అవగాహన పెరిగింది. దీంతో ఆర్ఎస్ఎస్(రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్) కూడా జెన్‌జీ కోసం పాకులాడుతుందన్న వార్తలు వస్తున్నాయి. అందుకే యువత వైపు దృష్టి పెట్టిందని చర్చలు జరుగుతున్నాయి. ముంబైలోని నీతా ముకేష్ అంబానీ కల్చరల్ సెంటర్‌లో జరుగుతున్న ఒక యువ కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పాల్గొనడం చర్చను పెంచింది.

**ఐఐఎంయూఎన్ కార్యక్రమం..**
ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది ఐఐఎంయూఎన్ (ఇండియాస్ ఇంటర్నేషనల్ మూవ్‌మెంట్ టు యునైట్ నేషన్స్). రిషభ్ షా స్థాపించిన ఈ సంస్థ 15 ఏళ్లుగా యువతలో నాయకత్వం, భారతీయ దృక్పథం, ప్రపంచ సమస్యలపై చర్చలు ప్రోత్సహిస్తోంది. ప్రతీ సంవత్సరం యూత్ కార్యక్రమాలు నిర్వహించే ఈ సంస్థ ఈసారి 100కు పైగా ప్రధాన పట్టణాల నుంచి 15 నుంచి 19 ఏళ్ల వయసున్న వేలాది మంది విద్యార్థులను ఎంపిక చేసింది. నాలుగు రోజుల కార్యక్రమంలో వసతి సౌకర్యాలతో శిక్షణ, చర్చలు జరుగుతాయి. చివరి రోజు మోహన్ భగవత్ జెన్‌జీపై ప్రసంగించి, సంభాషణ జరపడం ప్రత్యేకం.

**జీజేపీని చూసి నిర్వహించేది కాదు..**
ఇది ఆర్ఎస్ఎస్ కార్యక్రమం కాదు. సీజేపీ (కాక్రోచ్ జంతా పార్టీ) లాంటి ఉద్యమాలకు పోటీగా తెచ్చినది కూడా కాదు. 15 ఏళ్ల క్రితమే పుట్టిన ఈ సంస్థ సాధారణ వార్షిక కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. కొన్ని మీడియా, సోషల్ మీడియా వర్గాలు దీన్ని సీజేపీకి ప్రతిస్పందనగా చిత్రీకరించడం ప్రచార స్థాయిలో ఉంది. కానీ ఆహ్వానం ముందుగానే ఇచ్చినట్లు సంస్థ చెబుతోంది. భగవత్ గతంలో కూడా ఈ వేదికపై మాట్లాడారు. ఇది జెన్‌జీ మూడ్‌ను అర్థం చేసుకునే అవకాశంగా చూడవచ్చు.

**ఆర్ఎస్ఎస్ యువత వ్యూహం వేరే..**
ఆర్ఎస్ఎస్ ఒక తరం ముందు ఆలోచించే సంస్థగా తనను తాను చూస్తుంది. శతాబ్ది వేడుకల్లో భాగంగా మహిళలు, గిరిజనులు, యువత కోసం ప్రత్యేక కార్యక్రమాలు, రూట్ మార్చ్‌లు, సమ్మేళనాలు నిర్వహించింది. దేశవ్యాప్తంగా లక్షన్నరకు పైగా కార్యక్రమాలు జరిగాయి. యువ ఆయాన్ వంటి పేర్లతో యువతను కనెక్ట్ చేసే ప్లాన్‌లు ఉన్నాయి. కులాల మధ్య అంతరాలు, ఘర్షణలు తొలగించే దిశగా కూడా పని చేస్తోంది. ఐఐఎంయూఎన్ కార్యక్రమం ముగిసిన తర్వాత దేశవ్యాప్తంగా లక్షల స్థాయిలో యువ కార్యక్రమాలు కొనసాగే అవకాశం ఉంది. ఆర్ఎస్ఎస్ విధానం తాత్కాలిక ఉద్యమాల్లా కాకుండా నిరంతర శిక్షణ, విలువలు, సంస్థాగత నిర్మాణంపై ఆధారపడి ఉంటుంది.

**మీడియాలో కొత్త చర్చ..**
సీజేపీ నేపథ్యంలో జెన్‌జీ గురించి మాట్లాడుతుండడంతో ఆర్ఎస్ఎస్ దృష్టి పెట్టిందని కొందరు అంటున్నారు. కానీ ఐఐఎంయూఎన్ 15 ఏళ్ల చరిత్ర, ముందుగా ప్లాన్ చేసిన కార్యక్రమం ఈ వాదనను బలహీనపరుస్తాయి. ఆర్ఎస్ఎస్ యువతను తన శాఖలు, సమ్మేళనాలు, సేవా కార్యక్రమాల ద్వారా నిరంతరం కలుపుతూ వస్తోంది. ఒక కార్యక్రమం మాత్రమే కాకుండా, విస్తృత ప్రణాళిక భాగంగా చూడాలి. జెన్‌జీకి కారణాలు, సంభాషణ అవసరమని గుర్తించి స్పందించడం సానుకూలం. అయితే యువత స్వతంత్రంగా ఆలోచించే తరం.



## పాడ్‌కాస్ట్‌లో కేటీఆర్.. ప్రభాస్‌కు ప్రాంక్ కాల్

ఓ పాడ్‌కాస్ట్‌లో ప్రభాస్ (Prabhas)కు కేటీఆర్ ప్రాంక్ కాల్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ పాడ్‌కాస్ట్‌లో కేటీఆర్ జెన్‌జీ బృందంతో సమావేశమవగా.. వారు ఎవరైనా స్టార్ హీరోకి కాల్ చేయమని కోరారు. ఈ క్రమంలో ప్రభాస్‌కు కాల్ చేశారు. వెంటనే పక్కనున్న అమ్మాయి మొబైల్ తీసుకొని.. 'ఈ ఫోన్ రోడ్డుపై దొరికింది' అంటూ ప్రాంక్ చేసింది. ఆయన కాల్ కట్ చేశారు. అనంతరం కేటీఆర్.. మళ్లీ ప్రభాస్‌కి ఫోన్ చేసి విషయం చెప్పారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 12.09.2026
www.mudranews.in | @mudranews



## జింక్, ఐరన్ మర్చిపోవద్దు

బాదం, జీడిపప్పు, విత్తనాలు, చిక్కుళ్లు వంటి జింక్ వనరులతో పాటు ఆకుకూరలు, గుడ్లు, ఖర్జూరం వంటి ఐరన్ ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి.



## విశేష అలంకరణలో నిమిషాంబిక మాత

శ్రీ సోమవంశ క్షత్రియ నకాష్ కులస్తుల కులదేవత అయిన శ్రీ మాతా నిమిషాంబ దేవి అమ్మవారిని శ్రావణమాసం ఐదవ శుక్రవారం సందర్భంగా విశేషంగా అలంకరించారు. ఆలయానికి హాజరైన మహిళలు సామూహికంగా లలితా పారాయణం చేస్తూ, అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో పుష్పార్చన చేశారు. అనంతరం మధ్యాహ్నం భక్తులందరికీ ఆలయ కమిటీ అన్నదానం నిర్వహించింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్ కుమార్, సెట్లర్ కళావతి, ప్రధాన కార్యదర్శులు కె.అశోక్ కుమార్, సంగు శ్రీనివాస్, కోశాధికారి ఎన్. రమేష్ , రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచెర్ల శ్రీనివాస్ రావు భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రధాన అర్చకుడు చంద్రశేఖర శర్మ, అర్చకుడు ఉమకాంత శర్మ భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ట్రస్ట్ ధర్మకర్తలు ఎస్. గౌరి శంకర్, డి. నర్సింగ్ రావు, ఎమ్. శ్రీనివాస్ రావు, ఎమ్. సాయి బాబా (శ్యామ్), బి. హిమచందర్, డి. సతీష్, రామగిరి శ్రీకాంత్, ఎన్. శ్రీకాంత్, ఎన్ . రామకృష్ణ, వై. చంద్రశేఖర్, ఎన్. మోహన్, డి. రామక్రిష్ణ, ఎన్. శ్రీధర్, వెంకట్ రాజారావు, కె. ప్రవీణ్ కుమార్, డి. నరేష్, వై. సత్యనారాయణ పాల్గొన్నారు. – ముద్ర, బోడుప్పల్



# దుర్గం చెరువులోకి మురుగునీరు రాకుండా శాశ్వత చర్యలు

**ముద్ర, హైదరాబాద్, సెప్టెంబర్ 11:** హైదరాబాద్ ప్రతిష్ఠాత్మక దుర్గం చెరువులోకి మురుగునీరు చేరకుండా తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా శాశ్వత పరిష్కారం చూపాలని జలమండలి ఎండీ కె. అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం దుర్గం చెరువును సందర్శించిన ఆయన.. చెరువులోకి చేరుతున్న నాలాలు, మురుగునీటి ప్రవాహాలు, ఎస్టీపీలు, వర్షపు నీటి కాలువలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.చెరువులోకి ఏ మార్గం ద్వారా ఎంత నీరు వస్తోంది.. అందులో మురుగునీరు, శుద్ధి చేసిన నీరు, వర్షపు నీరు ఎంత అనే వివరాలను పక్కాగా గుర్తించాలని సూచించారు. వర్షం లేని రోజుల్లో నాలాల్లో మురుగునీటి ప్రవాహం పూర్తిగా నిలిపివేయడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు.నాలాల ప్రారంభ స్థానం నుంచి చెరువు వరకు అన్ని ప్రవాహ మార్గాలను గుర్తించి ఒకటి రెండు రోజుల్లో సమగ్ర మ్యాప్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రస్తుత పైప్‌లైన్ల సామర్థ్యం, ప్రవాహ స్థాయిలు, గ్రావిటీ ప్రవాహం, ఎస్టీపీల సామర్థ్యాలను పరిశీలించి అవసరమైన చోట కొత్త మురుగునీటి లైన్లు, ట్రంక్ మెయిన్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. 2047 నాటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక ప్రణాళిక రూపొం



దించాలన్నారు.ప్రైవేట్ ఎస్టీపీలపై ప్రత్యేక దృష్టిదుర్గం చెరువు పరివాహక ప్రాంతంలోని హోటళ్లు, వాణిజ్య సముదాయాలు, ఎత్తైన భవనాలు, నివాస సముదాయాల్లోని ప్రైవేట్ ఎస్టీపీలపై సమగ్ర సర్వే నిర్వహించాలని ఎండీ ఆదేశించారు. ఎస్టీపీల సామర్థ్యం, వాస్తవంగా శుద్ధి చేస్తున్న నీటి పరిమాణం, శుద్ధి చేసిన నీటిని ఎక్కడ వినియోగిస్తున్నారు, మిగిలిన నీటిని ఎక్కడ విడుదల చేస్తున్నారు అనే వివరాలను సేకరించాలన్నారు.ప్రైవేట్ ఎస్టీపీల నుంచి విడుదలయ్యే నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట ప్రవాహాన్ని కొలిచే మీటర్లు ఏర్పాటు చేసి శుద్ధి చేసిన నీరు మాత్రమే బయటకు విడుదలయ్యేలా చూడాలని స్పష్టం చేశారు.శుద్ధి చేసిన నీటిని చెరువులకు మళ్లించాలిఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని వృథాగా పోనివ్వకుండా సమీప చెరువులకు మళ్లించి వాటి నీటి సమతుల్యతను కాపాడాలని అశోక్‌రెడ్డి సూచించారు. ఎస్టీపీ వారీగా లభించే శుద్ధి చేసిన నీరు, సమీప చెరువుల అవసరాలను అంచనా వేసి పైప్‌లైన్లు, పంపింగ్ వ్యవస్థలతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.మురుగునీటి, వర్షపు నీటి వ్యవస్థలను పూర్తిగా వేరు చేయాలని, అవసరమైతే ప్రత్యేక మురుగునీటి పైప్‌లైన్‌ను ప్రధాన ట్రంక్ మెయిన్‌కు అనుసంధానించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. వర్షాల సమయంలో చెరువులోకి చేరే ప్లాస్టిక్, చెత్తను మూలస్థాయిలోనే అడ్డుకునే చర్యలు చేపట్టాలన్నారు.“దుర్గం చెరువు హైదరాబాద్‌కు ప్రతిష్ఠాత్మకమైన ప్రాంతం. నిధుల కంటే శాశ్వత పరిష్కారమే ముఖ్యం. చెరువులోకి మురుగునీరు చేరకుండా మూలస్థాయి నుంచి చివరి వరకు పక్కా కార్యాచరణ ఉండాలి” అని ఎండీ అశోక్‌రెడ్డి స్పష్టం చేశారు.కార్యక్రమంలో సైబరాబాద్ ఈడీ సంతోష్, ఎస్టీపీ సీజీఎం పద్మజ, జీఎం హరిశంకర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలి

**ముద్ర, హైదరాబాద్:**వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు నిర్వాహకులు, ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనర్ ఐపీఎస్ కోరారు. శుక్రవారం విశ్వేశ్వరయ్య భవన్‌లో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, వివిధ ఉత్సవ కమిటీల నిర్వాహకులతో పోలీసులు సమన్వయ సమావేశం నిర్వహించారు.సీపీ సజ్జనర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అదనపు సీపీలు ఎ. శ్రీనివాస్, తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సీపీ ట్రాఫిక్ డి. జోయల్ డేవిస్‌తో పాటు నగరంలోని డీసీపీలు పాల్గొన్నారు.హైదరాబాద్ గణేష్ ఉత్సవాలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందని సజ్జనర్ తెలిపారు. ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరపున అన్ని భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు.విగ్రహాల రాకలో జాగ్రత్తలువిగ్రహాల ఆగమన సమయంలో అధిక వేగం, రద్దీ, వాహనాలపై డ్యాన్సుల కారణంగా ట్రాఫిక్ సమస్యలతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయని సీపీ పేర్కొన్నారు. విగ్రహాల రాక



సమాచారాన్ని ముందుగానే పోలీసులకు తెలియజేసి, రద్దీ తక్కువగా ఉన్న సమయాల్లో సురక్షితంగా మండపాలకు తరలించాలని సూచించారు.ఊరేగింపు మార్గాల్లో విద్యుత్ వైర్లు, చెట్ల కొమ్మలు, రోడ్ల మరమ్మతులు వంటి అడ్డంకులను ఇప్పటికే సంబంధిత శాఖలతో సమన్వయంతో పరిశీలించామని, త్వరలో పోలీసు అధికారులు రూట్ విజిట్ నిర్వహిస్తారని తెలిపారు.మండపాల వద్ద వాలంటీర్లు తప్పనిసరిప్రతి గణేష్ మండపం వద్ద 4 నుంచి 5 మంది బాధ్యతాయుతమైన వాలంటీర్లను కేటాయించాలని సీపీ సూచించారు. వారి వివరాలను పోలీస్ యాప్‌లో నమోదు చేయాలని, ప్రత్యేక గుర్తింపు కోసం ఒకే రంగు దుస్తులు లేదా బ్యాడ్జీలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.శబ్ద కాలుష్యంపై నియంత్రణ గణేష్ ఉత్సవాల సమయంలో శబ్ద కాలుష్యంపై ముఖ్యంగా ఆసుపత్రుల్లోని రోగులు, వృద్ధుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని సజ్జనర్ తెలిపారు. పండుగను ఉత్సాహంగా జరుపుకుంటూనే ఇతరులకు ఇబ్బంది కలగకుండా సౌండ్ సిస్టమ్స్ వినియోగాన్ని పరిమితం చేసుకోవాలని కోరారు.ప్రధాన నిమజ్జనం రోజున మరుసటి రోజు మధ్యాహ్నం వరకు ఊరేగింపులు కొనసాగకుండా, మండపాల నిర్వాహకులు ఉదయమే ఊరేగింపులు ప్రారంభించేలా ప్రోత్సహించాలని సమితి ప్రతినిధులను కోరారు.ఖైరతాబాద్, బాలాపూర్‌పై ప్రత్యేక దృష్టిఖైరతాబాద్ బడా గణేష్, బాలాపూర్ ప్రాంతాల్లో భారీ రద్దీ దృష్ట్యా ప్రత్యేక ట్రాఫిక్, బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని సీపీ తెలిపారు. ఉన్నతాధికారులు స్వయంగా ఏర్పాట్లను నిరంతరం సమీక్షిస్తారని చెప్పారు.ప్రజలు, నిర్వాహకుల్లో అవగాహన పెంచేందుకు పోలీస్ స్టేషన్ల వద్ద ప్రత్యేక సమాచార బ్యానర్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సామూహిక భాగస్వామ్యంతో భక్తిశ్రద్ధలు, సంప్రదాయాలకు అనుగుణంగా గణేష్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని పోలీసు అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు పిలుపునిచ్చారు.

## బ్రిక్స్ దేశాధినేతలకు అదిరిపోయే వంటకాలు

**ముద్ర, ఢిల్లీ :** చైనా దేశస్తులు సూప్ లు ఎక్కువగా తాగుతూ ఉంటారు. నూడిల్స్ హాయిగా ఆస్వాదిస్తూ తింటారు. రష్యా దేశస్తులు మాంసాన్ని ఎక్కువగా తింటారు. పిజ్జాలు, బర్గర్లను దంచేస్తూ ఉంటారు. ఇలా ఒక్కొక్క దేశంలో ప్రజలకు ఒక్కో తీరుగా ఆహారపు అలవాట్లు ఉంటాయి. ఆ దేశ ప్రజలు ఏమో గాని.. ఆదేశాలను పరిపాలించే నేతలు మాత్రం కచ్చితంగా భారతీయ వంటకాలను తినాల్సిందే. మన కారం ఘాటును.. మసాలా హీటును భరించాల్సిందే. ఇదంతా ఎందుకంటే రేపటి నుంచి మనదేశ రాజధాని ఢిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరుగుతుంది. ఈసారి ఈ సదస్సుకు భారతదేశం ఆతిథ్యం ఇస్తోంది. ఢిల్లీలోని భారత్ మండపంలో ఏర్పాట్లను అద్భుతంగా చేశారు. బ్రిక్స్ సదస్సుకు రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్, సౌత్ ఆఫ్రికా ప్రెసిడెంట్ సిరిల్, ఇరాన్ ప్రెసిడెంట్ మసూద్, ఈజిప్ట్ ప్రెసిడెంట్ అబ్దెల్ వంటి వారు హాజరు కాబోతున్నారు. వీరిలో పుట్టింది ఇప్పటికే ఢిల్లీ వచ్చారు. ప్రపంచ దేశాల నుంచి ఆతిరథ మహారధులు వస్తున్నారు. వారికి ప్రత్యేకమైన భారతీయ వంటకాలను పరిచయం చేయబోతున్నారు. ప్రముఖమైన హోటళ్ల చెఫ్ లు విభిన్నమైన వంటకాలను సిద్ధం చేశారు. కాశ్మీర్ మసాలా వాల్నట్స్.. గలవుటి కబాబ్ ఇంకా



అనేక రకాల వంటకాలను సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. ఢిల్లీలోని ప్రఖ్యాతమైన తాజ్ మహల్, ది లీలా ప్యాలెస్, ది లలిత్ వంటి హోటళ్లు ఇండియన్ వంటకాలను, ఆధునిక,అంతర్జాతీయ స్థాయిలో అతిధులకు వడ్డించబోతున్నాయి. తాజ్ మహల్ హోటల్లో విఐపి అతిధులకు ట్రెడిషన్ టు టేబుల్ పేరుతో ప్రత్యేకమైన ఆహారపు వంటకాలను సర్వ్ చేయబోతున్నారు. తాజ్మహల్ హోటల్లో పనిచేసే చెఫ్ లు తమ తల్లుల నుంచి నేర్చుకున్న వంటకాలను ఈ మెనులో రూపొందించారు. పురాని ఢిల్లీ మైదా కాజు.. మహారాష్ట్ర బాకర వడి.. రాజస్థాన్ మినీ కచోరి.. బెంగాల్ కూర్చో నిముకి.. తమిళనాడులోని మురుక్కు వంటి వంటకాలు ఇందులో ఉన్నాయి. ప్రపంచ దేశాల అధినేతల కోసం ఢిల్లీ వ్యాప్తంగా మూడు వేలకు పైగా హోటల్ గదులను బుక్ చేశారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఢిల్లీలోని ఐటిసి మౌర్య హోటల్లో ఉండబోతున్నారు.

## కాంగ్రెస్ పార్టీ మీద దానం నాగేందర్ ఫ్రస్టేషన్

**(ముద్ర డెస్క్)**



2023 ఎన్నికల్లో గులాబీ పార్టీ టికెట్ మీద గెలిచి.. ఖైరతాబాద్ స్థానం నుంచి శాసనసభకు ఎన్నికై.. కాంగ్రెస్ పార్టీకి అనుకూలమైన వ్యక్తిగా మారిపోయారు దానం నాగేందర్. పైగా ఆయన 2024 ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేశారు. చివరికి ఓడిపోయారు. దానం నాగేందర్ ప్రస్తుతం రాజకీయంగా సంకటమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో శాసనసభ వేదికగా ఆయన తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ నుంచి ఆశించిన స్థాయిలో సపోర్టు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నమెంట్ సపోర్ట్ చేయకపోతే పెద్దపెద్ద కంపెనీలు రాష్ట్రానికి ఎలా వస్తాయంటూ నేరుగా ప్రశ్నించారు. దానం నాగేందర్ కు అమెరికాకు చెందిన ఫార్చ్యూన్ 500 ఐటి సంస్థ ఇన్ఫినిట్ అధినేత సంజయ్ గోయల్ కు ఫ్రెండ్షిప్ ఉంది. ఈయన హైదరాబాద్, తెలంగాణ ప్రాంతాలలో తన కార్యాలయాలను విస్తరించాలని కోరుకున్నారు. ప్రభుత్వం సరైన స్థాయిలో సపోర్ట్ ఇవ్వకపోవడంతో తెలంగాణ రాష్ట్రంలో విస్తరించే తన ఆలోచనను ఆయన విరమించుకున్నారు. నా స్నేహితుడి కంపెనీ ఏర్పాటు కోసం ఎన్నోసార్లు ప్రయత్నాలు చేశాడు. హైదరాబాద్ వచ్చాడు. వచ్చిన ప్రతిసారి నిరాశతోనే వెనక్కి వెళ్ళిపోయాడు. వచ్చినందుకు చాయ్, కాఫీ తాగితే వచ్చింది. ఎంపిక చేసిన కొంతమంది వ్యక్తులకు మాత్రమే ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరుస్తోంది. భూముల కేటాయింపులో నిబంధనలు పాటించాలి. అనుమతులలో పారదర్శకత ఉండాలని వ్యాఖ్యానించారు. నాగేందర్ మాట్లాడుతున్నప్పుడు పక్కనే ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు ఉన్నారు. నాగేందర్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఫార్చ్యూన్ 500 స్థాయి కంపెనీ అధినేతను తెలంగాణకు తీసుకొస్తే.. ప్రభుత్వం పట్టించుకోలేదనే అపవాదు తెరపైకి వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా దావోస్.. లండన్.. అమెరికా వెళ్తున్నారు. పెట్టుబడులు తేవడానికి కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నాగేందర్ లాంటి ఎమ్మెల్యేలు ప్రభుత్వం మీద విమర్శలు చేయడంతో గులాబీ పార్టీకి అనుకోని ఆయుధం లాగా మారిపోయింది. మరి దీనిపట్ల ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది.

## మధు యాష్కీ గౌడ్‌కు సీఎం రేవంత్ శుభాకాంక్షలు

**ముద్ర, హైదరాబాద్:** ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్‌పర్సన్‌గా నియమితులైన మధు యాష్కీ గౌడ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో మధు యాష్కీ గౌడ్‌ను అభినందించారు.ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా మధు యాష్కీ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



## ఫైర్ ఆర్మ్స్ చోరీ కేసులో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి అరెస్ట్

**ముద్ర, హైదరాబాద్, సెప్టెంబర్ 11:** బొల్లారం 20వ బెటాలియన్ మద్రాస్ రెజిమెంట్‌లోని కోటే, మ్యాగజైన్ గదుల నుంచి తుపాకులు, మందుగుండు సామగ్రి చోరీ చేసిన కేసులో రిటైర్డ్ ఆర్మీ హవిల్దార్‌ను బొల్లారం పోలీసులు అరెస్ట్ చేశారు. మల్కాజ్‌గిరి పోలీస్ జోన్, హైదరాబాద్ సిటీ టాస్క్‌ఫోర్స్, తెలంగాణ స్టేట్ ఇంటెలిజెన్స్ విభాగాల సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం జంగం రెడ్డిపల్లికి చెందిన ఉప్పుతోళ్ల మల్లేష్ (37) 20వ బెటాలియన్ మద్రాస్ రెజిమెంట్‌లో హవిల్దార్‌గా పనిచేసి 2026 జూన్ 30న పదవీ విరమణ చేశాడు. 2010లో ఆర్మీలో చేరిన అతను సుమారు 16 ఏళ్లపాటు సేవలందించాడు.పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం ముందస్తు పదవీ విరమణపై అసంతృప్తితోనే మల్లేష్ ఆయుధాల చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. ఆగస్టు 30/31 అర్ధరాత్రి బొల్లారం 20వ బెటాలియన్ ప్రాంతానికి చేరుకుని కోటే, మ్యాగజైన్ గదుల నుంచి ఆయుధాలు, మందుగుండు సామగ్రిని అపహరించినట్లు పోలీసులు తెలిపారు.భారీగా ఆయుధాలు స్వాధీనంచోరీకి గురైన వాటిలో 4 AK-203 రైఫిళ్లు, ఒక INSAS రైఫిల్, 7 పిస్టళ్లు, నైట్ విజన్ బైనాక్యులర్, అలాగే పిస్టల్, AK-203, INSASకు సంబంధించిన పెద్ద మొత్తంలో మందుగుండు సామగ్రి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.ఫిర్యాదు మేరకు బొల్లారం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 207/2026 కింద BNS సెక్షన్లు 331(4), 305తో కేసు నమోదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఏసీపీ స్థాయి అధికారి దర్యాప్తు చేపట్టారు.విశ్వసనీయ సమాచారం ఆధారంగా పోలీసులు, హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్, మల్కాజ్‌గిరి ఎస్ఓటీ అధికారులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టారు. చోరీ చేసిన ఆయుధాలు, మందుగుండు సామగ్రిని కౌకూర్, యాప్రాల్, నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ప్రాంతాల్లోని తన నివాసం, సంబంధిత ప్రదేశాల్లో దాచినట్లు గుర్తించారు.సెప్టెంబర్ 11న మల్లేష్‌ను అరెస్ట్ చేసి, చట్టపరమైన ప్రక్రియ అనంతరం న్యాయ రిమాండ్‌కు తరలించారు. వివిధ పోలీసు విభాగాల సమన్వయంతో తక్కువ సమయంలోనే నిందితుడిని అరెస్ట్ చేయడం గమనార్హం.

## స్టైఫండ్ పెంచడం సంతోషకరం



**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్:** ఆయుష్ విద్యార్థులకు స్టైఫండ్ పెంచడం చాలా సంతోషకరంగా ఉందని తెలంగాణ పీసిసి వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిప్పరాజు వెంకట నగేష్ అన్నారు. ఆయుష్ వైద్య విద్యార్థులకు స్టైఫెన్ పెంచాలని కోరుతూ కొద్ది నెలలుగా ధర్నాలు నిర్వహిస్తున్నారు. దీనికి స్పందించి వారితో చర్చలు జరిపిన అనంతరం తెలంగాణ ప్రభుత్వం వారికి స్టైఫండ్ పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సంతోషం వ్యక్తం చేస్తూ డాక్టర్ నగేష్ పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఆయుష్ వైద్య విధానం ప్రాచీనమైనదని అలాంటిది అంతరించిపోకుండా ఆ విద్యపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. స్టైఫండ్ పెంచడం వల్ల విద్యార్థుల సమస్య పరిష్కారం అయిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. పోరాడి సాధించిన విద్యార్థులు ప్రొఫెసర్లకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

## శేరిలింగంపల్లిలో పర్యటించిన తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి

**ముద్ర, శేరిలింగంపల్లి:** ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ –2026 ప్రక్రియ పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా నారాయణ్ అమిత్ ఐఏఎస్ శేరిలింగంపల్లి సర్ ను ఆయనకు వివరించారు సీఈఓ క్షేత్రస్థాయిలో జరుగుతున్న కార్యక్రమాలను మరియు ప్రక్రియ పురోగతిని వ్యక్తిగతంగా పరిశీలించారు. ఓటర్ల జాబితా సవరణ పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఖచ్చితత్వం: ఈ ప్రక్రియలో పూర్తి పారదర్శకత మరియు ఖచ్చితత్వం పాటించాలని, నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా పనులు జరగాలని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్–2026 ప్రక్రియను ఎలాంటి తప్పులు లేకుండా, క్రమబద్ధమైన పద్ధతిలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. దీని ద్వారా నమ్మకమైన మరియు తాజా ఓటర్ల జాబితాను సిద్ధం చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.



## ఏక పక్ష నిర్ణయాలు తీసుకుంటున్న కమీషనర్ పై చర్యలు తీసుకోవాలి



**వైస్ చైర్ పర్సన్. శ్వేత పాండురంగారెడ్డి**

**ముద్ర, చేవెళ్ల:** శంకర్ పల్లి పురపాలిక కమిషనర్ యోగేష్ తనకు గౌరవం ఇవ్వడం లేదని,ప్రాధాన్యత కల్పించడం లేదని వైస్ చైర్ పర్సన్ శ్వేత పాండురంగారెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆమె శంకర్ పల్లి పురపాలికలో విలేకరుల సమావేశం లో ఆయన పని తీరు పై విమర్శించారు. కీలక అంశాల పై సమాచారం ఇవ్వకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగాపురం, బుల్కాపురం లలో అక్రమ నిర్మాణాలు జోరుగా జరుగుతున్నా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.అక్రమ నిర్మాణాల పై స్పందించడం లేదని అన్నారు. పురపాలికలో అక్రమ నిర్మాణాలు, అదికారుల పని తీరు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## నగర కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యత్వం కల్పించాలి

**ముద్ర, హైదరాబాద్:** జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని నగర కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో–ఆప్షన్ సభ్యులు గా అవకాశం కల్పించేలా కొత్త బిల్లును వర్తింపజేయాలని ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాసనమండలిలో ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో ట్రాన్స్‌జెండర్లు రాజధాని పరిసర ప్రాంతాల్లోనే నివసిస్తున్నారని, రాబోయే డీలిమిటేషన్ నేపథ్యంలో ఏర్పడనున్న ప్రధాన నగర కార్పొరేషన్లకు ఈ బిల్లును వర్తింపజేయకపోతే వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. కేరళ, తమిళనాడు తరహాలో తెలంగాణలోనూ ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా రాష్ట్రాల్లో అమలవుతున్న సంక్షేమ, సాధికారత విధానాలను అధ్యయనం చేసేందుకు అధికారుల బృందాన్ని పంపా లని కోరారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 12.09.2026
www.mudranews.in | @mudranews



### కాల్షియం కోసం పాలు, రాగులు

ఎముకలు, దంతాల పటిష్టతకు పాలు, పెరుగు, రాగి జావ లేదా రాగి ముద్ద వంటి కాల్షియం అధికంగా ఉండే ఆహారాన్ని రోజువారీ మెనూలో చేర్చుకోవాలి. పిల్లలకు డాక్టర్ సలహా లేకుండా విటమిన్ ట్యాబ్లెట్లు ఇవ్వకూడదు.



## విద్యే తెలంగాణ భవిష్యత్తుకు బాట

**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ విద్యా విధానంపై శాసనసభలో చర్చ జరగడం శుభ పరిణామమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సభ్యుల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ప్రపంచంతో పోటీ పడేలా రాష్ట్రంలో నూతన విద్యా విధానాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు. విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసి నివేదిక తీసుకున్నామని, దానిని పరిశీలించేందుకు కేకే నేతృత్వంలో కమిటీని నియమించామని సీఎం వెల్లడించారు. విద్యకు బడ్జెట్‌లో 15 శాతం కేటాయించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నందుకే విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నానని చెప్పారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం 2023–24లో విద్యాశాఖకు రూ.19,093 కోట్లు కేటాయించగా, తమ ప్రభుత్వం 2024–25లో రూ.21,292 కోట్లు, 2025–26లో రూ.23,108 కోట్లు, 2026–27లో రూ.26,647 కోట్లకు పెంచిందన్నారు. మూడేళ్లలో విద్యా బడ్జెట్‌ను రూ.7,554 కోట్లు పెంచామని వివరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 55 రోజుల్లో 10,006 మంది ఉపాధ్యాయులను నియమించామని, ఎలాంటి ఆరోపణలకు తావులేకుండా నియామకాలు పూర్తి చేశామని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో కేవలం 7,857 మంది టీచర్లను నియమించిందని పేర్కొన్నారు.

జెన్ ఆల్ఫా, జెన్ బీటా తరాలను దృష్టిలో పెట్టుకుని విద్యా విధానాన్ని రూపొందిస్తున్నామని, ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా విధానాలను రాష్ట్రానికి తీసుకొస్తున్నామని సీఎం చెప్పారు. తాను విద్యాశాఖ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 86 వేల మేర పెరిగిందని, ఇది ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని రేవంత్‌రెడ్డి అన్నారు.



## గీకురు రవీందర్ మృతి తీరని లోటన్న ఈటెల..



**ముద్ర చిగురుమామిడి:** తెలంగాణ ఉద్యమకారుడు,బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు,కరీంనగర్ జిల్లా మాజీ జెడ్పి ఫ్లోర్ లీడర్,చిగురుమామిడి మండల మాజీ జెడ్పీటీసీ,మాజీ సర్పంచ్ గీకురు రవీందర్ ఇటీవల మృతిచెందగా శుక్రవారం వారి స్వగృహానికి మల్కాజిగిరి ఎంపీ, మాజీ మంత్రి ఈటల రాజేందర్,చొప్పదండి మాజీఎమ్మెల్యే బొడిగ శోభ,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డిలు రవీందర్ కుటుంబ సభ్యులను పరామర్శించి,తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా ఈటల రాజేందర్ రవీందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.అనంతరం ఈటల రాజేందర్ మాట్లాడుతూ తన సుదీర్ఘ ఉద్యమ సహచరుడు, ప్రజా సేవకుడు అయిన గీకురు రవీందర్ మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.తన ఆప్తుడైన రవీందర్ అకాల మరణం వారి కుటుంబానికే కాకుండా,చిగురుమామిడి మండల ప్రజలకు తీరని లోటని అన్నారు.వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో మచ్చ పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షులు పిట్టల రవీందర్,తెలంగాణ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కునచ్చుల మహేందర్,వెంకటేశ్వరపల్లె సర్పంచ్ రాయిశెట్టి చంద్రయ్య,బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు పోలోజు సంతోష్ కుమార్,ముదిరాజ్ సంఘం అధ్యక్షులు చెరుకు సంజీవ్, ముదిరాజ్ సంఘం పెద్దమనిషి చెరుకు చిన్నసమ్మయ్య,బిజెపి మండల ప్రధాన కార్యదర్శి, సర్పంచ్ గునుకుల మధుసుదన్ రెడ్డి,అచ్చ రవీందర్,పిల్లి తిరుపతి, భీమర లక్ష్మణ్,తిప్పారపు శ్రీనివాస్,ఉపాధ్యక్షులు గందే చిరంజీవి,పెసరి హరీష్,ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు పడాల శ్రీనివాస్,యువమోర్చా ప్రెసిడెంట్ సిద్ధంకి అనిల్, పార్టీ నాయకులు మామిడి రమేష్ ,గందె రమేష్,నక్క రాజేందర్ తో పాటు పలువురు ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి




**ముద్ర, కరీంనగర్** : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కరీంనగర్‌లో బ్యాంకు ఉద్యోగులు నిరసన ప్రదర్శన చేపట్టారు. పవర్ సర్కిల్ నుంచి తెలంగాణ చౌక్ వరకు ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. రెండు ప్రధానమైన డిమాండ్లతో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి వినతి పత్రాన్ని అందించామన్నారు. వారానికి ఐదు రోజుల బ్యాంకింగ్ విధానం అమలు సహా పలు డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈనెల 28, 29 రెండు రోజుల సమ్మె చేపడతామన్నారు.

## రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన




**ముద్ర, కరీంనగర్ :** తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా కరీంనగర్‌లో శుక్రవారం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నగరంలో భారీ ర్యాలీ ప్రదర్శన చేపట్టి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైస్ మిల్లర్లపై అక్రమ కేసులను ఎత్తివేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైస్ మిల్లర్లతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్-విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్‌జామ్



**ముద్ర, హైదరాబాద్**: మూడు రోజుల పాటు సెలవుల నేపథ్యంలో హైదరాబాద్– విజయవాడ హైవే పై రద్దీ నెలకొంది. రెండో శనివారం, ఆదివారం, వినాయక చవితి (సోమవారం) సెలవులు వరుసగా రావడంతో ప్రజలు సొంతూళ్లకు పయన మవుతు న్నారు. దీంతో హైదరా బాద్‌లోని హయత్‌నగర్ వద్ద భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. హైవేపై ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరిస్తున్నారు.

## రాష్ట్ర స్థాయి సాహితీ పురస్కారానికి సుద్దాల అశోక్ తేజ ఎంపిక



**ముద్ర, కరీంనగర్** : తెలుగు భాషా సంరక్షణ సంఘం తెలంగాణ సాహితీ సంస్థ ఏటా ప్రదానం చేస్తున్న రాష్ట్ర స్థాయి బుర్ర నర్సమ్మ, లింగా రెడ్డి స్మారక 'తెలంగాణ తెలుగు తేజం' పేరుతో ఇచ్చే సాహిత్య పురస్కారాలను ప్రకటించింది. 2026 సంవత్సరానికి ప్రముఖ కవి, జాతీయ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ్‌ను ఎంపిక చేసినట్లు పురస్కార కమిటీ ఛైర్మన్, అవార్డు వ్యవస్థాపకులు కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి, తెలుగు భాషా సంరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం సేనాధిపతిలు తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం ఈ నెల 22న సాయంత్రం కరీంనగర్ పట్టణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలుగు భాషకు తెలంగాణ మట్టి బిడ్డలు చేసిన అమూల్య సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం అందిస్తున్నట్లు వారు తెలిపారు.

## విద్యా వ్యవస్థలో సమూల సంస్కరణలు

**ముద్ర, హైదరాబాద్:** రాష్ట్ర విద్యా వ్యవస్థను సమూలంగా మార్చే దిశగా తమ ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపట్టిందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. శాసనసభలో విద్యా వ్యవస్థలో సంస్కరణలపై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల అమలుతో పాటు విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రెండున్నరేళ్లలో ప్రీ ప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు పలు కీలక మార్పులకు శ్రీకారం చుట్టామని చెప్పారు. ప్రస్తుత మార్కెట్, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతను 'రెడీ టూ వర్క్ ఫోర్స్'గా తీర్చిదిద్దేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించామని మంత్రి తెలిపారు. అకడమిక్ కరిక్యులంలో మార్పులు చేసి, చదువుకుంటూనే విద్యార్థులు సంపాదించేలా ప్రముఖ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. బీఎఫ్ఎస్ఐ కన్సార్టియం సహకారంతో దేశంలోనే తొలిసారిగా డిగ్రీ, ఇంజినీరింగ్‌లో బీఎఫ్ఎస్ఐ కోర్సులను ప్రారంభించామని వివరించారు.

ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ బడులకు దీటుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని శ్రీధర్ బాబు అన్నారు. ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్య అందించేలా 104 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామని, రూ.21 వేల కోట్ల అంచనా వ్యయంతో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ 27 శాతానికి పెరిగిందన్నారు.

విద్యార్థుల సంక్షేమంలో భాగంగా పౌష్టికాహారంతో కూడిన బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఇంటర్మీడియట్ విద్యార్థులతో పాటు ప్రభుత్వ విద్యాసంస్థల్లోని బోధన, బోధనేతర సిబ్బందికి కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించామని తెలిపారు. డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మొటిక్ ఛార్జీలను 212 శాతం పెంచినట్లు వెల్లడించారు.

మెగా డీఎస్సీని విజయవంతంగా నిర్వహించడంతో పాటు ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లను ఎలాంటి వివాదాలకు తావులేకుండా చేపట్టామని మంత్రి పేర్కొన్నారు. విదేశాల్లో



విజయవంతమైన విద్యా సంస్కరణలను పరిశీలించేందుకు ఉపాధ్యాయులు, అధ్యాపకులను పంపించామని చెప్పారు. అన్ని విద్యాసంస్థలను డ్రగ్ ఫ్రీ క్యాంపస్‌లుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

బాలికల విద్యకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని, రూ.500 కోట్లతో 93 కేజీబీవీలను ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కోఠి ఉమెన్స్ కాలేజీని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీగా మార్చి రూ.500 కోట్లు కేటాయించామని చెప్పారు. టీసీఎస్ సహకారంతో 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రేడ్ సెంటర్లుగా అభివృద్ధి చేశామని, మొత్తం 127 ఐటీఐలను అదే తరహాలో తీర్చిదిద్దేందుకు ప్రణాళిక అమలు చేస్తున్నామని వెల్లడించారు.

క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించామని మంత్రి తెలిపారు. వరంగల్‌లో టీ–హబ్ తరహాలో కే–హబ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఇంక్యుబేషన్ హబ్‌ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు అందరి సలహాలు, సూచనలను స్వీకరించి అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

## కరెంట్ సమస్యలకు వాట్సప్ చాట్‌బాట్ నం.79016 28348



**ముద్ర, కరీంనగర్ :** గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులకు విద్యుత్తు భద్రత అవగాహన కల్పించాలని, మండపాల వద్ద భద్రత సూచనల గోడపత్రికలను ప్రదర్శించాలని ఎస్ఈ విజయేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కరీంనగర్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏఈ, ఏడీఈలు క్షేత్రస్థాయిలో వినాయక మండపాల ఎత్తును, వాటి శోభాయాత్రగా తీసుకెళ్లే రహదారులను పరిశీలించాలన్నారు. విద్యుత్తు లోడ్ అధికంగా ఉన్న సమయంలో త్రీఫేజ్ లైన్ క్లియరెన్స్‌లో తీసుకోవద్దన్నారు. కొత్త కనెక్షన్ మీటర్ దరఖాస్తు రెండు, మూడు రోజుల్లో బిగించి సర్వీసు రిలీజ్ చేయాలన్నారు. నియంత్రికలు కాలిపోతే డిపార్టుమెంట్ వాహనంలో రవాణా చేయాలన్నారు. నియంత్రికలు కాలిపోవడాన్ని 5 నుంచి 10 శాతానికి తగ్గించాలని ఆదేశించారు. వాట్సప్ చాట్‌బాట్ నం.79016 28348 విద్యుత్తు సమస్యల పరిష్కారానికి వినియోగదారులు ఉపయోగించేలా ప్రచారం చేయాలన్నారు. 1912 ఫోన్ ద్వారా వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కరించాలన్నారు.

## పుతిన్‌కు కానుకగా 'తిరుక్కురళ్'.. ఏమిటిది?

**ముద్ర, ఢిల్లీ :** బ్రిక్స్ కూటమి శిఖరాగ్ర సదస్సు కోసం భారత్‌కు విచ్చేసిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. భారత్ మండపానికి చేరుకున్న పుతిన్‌కు స్వాగతం పలికిన మోదీ.. ఓ పుస్తకాన్ని కానుకగా అందించారు. అదే ప్రముఖ కవి తిరువళ్లూర్ రచనా గ్రంథం తిరుక్కురళ్ . రష్యన్ భాషలోకి అనువదించిన ప్రతిని పుతిన్‌కు మోదీ అందజేశారు.



**ఏమిటీ తిరుక్కురళ్..?**

ప్రాచీన తమిళ సాహిత్యంలో అత్యంత ప్రసిద్ధి చెందిన రచనలలో తిరుక్కురళ్ ఒకటి. ఇందులో నైతికత, ప్రేమ, మంచితనం, సుపరిపాలన, సంపద, మనిషి ప్రవర్తన వంటి అనేక రకాల అంశాలతో కూడిన 1330 ద్విపదలు ఉన్నాయి. దీనిని మొత్తం 133 అధ్యాయాలుగా విభజించగా.. ఒక్కోదాంట్లో పది ద్విపదలు ఉన్నాయి. ఓ వ్యక్తి ప్రవర్తన ఎలా ఉండాలి? ఇతరులతో ఎలా వ్యవహరించాలి? అనే విషయాలు మొదలుకొని.. జీవితం, మరణం, వాటిమధ్య ఇమిడి ఉన్న అనేక విషయాలను ఇందులో ప్రస్తావించారు.

మొత్తంగా మానవ అస్తిత్వానికి సంబంధించిన ప్రశ్నలను లేవనెత్తుతూ నీతి వాక్యాలు రాశారు. కేవలం ఇవే కాకుండా పాలకులు, న్యాయం, వ్యవసాయం, పన్నులు, ప్రభుత్వాల గురించి పేర్కొన్నారు. దాదాపు 2వేల నుంచి రెండున్నర వేల సంవత్సరాల క్రితం తిరువళ్లూర్ రాసినట్లుగా భావించే ఈ అమూల్య గ్రంథాన్ని అర్థవంతమైన, నైతిక జీవితాన్ని గడపడానికి ఓ మార్గదర్శిగా అభివర్ణిస్తుంటారు. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్లాసికల్ తమిళ్ ప్రచురించిన ఈ రష్యన్ అనువాద గ్రంథాన్నే పుతిన్‌కు మోదీ అందించడం విశేషం.

## తెలంగాణలో అనలాగ్ పనీర్‌పై నిషేధం



**ముద్ర, హైదరాబాద్**: తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో అనలాగ్, నాన్ డెయిరీ, ఆర్టిఫిషియల్ పనీర్‌పై నిషేధం విధించింది. ప్రజారోగ్య ప్రయోజనాల దృష్ట్యా ఏడాది పాటు నిషేధం విధిస్తున్నట్లు టీజీ సేఫ్ వెల్లడించింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.పనీర్ పేరుతో తయారీ, ప్రాసెసింగ్, ప్యాకింగ్, నిల్వ, పంపిణీ, రవాణా విక్రయాలపై టీజీ సేఫ్ నిషేధం విధించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇది అమల్లో ఉంటుందని తెలిపింది. సెప్టెంబర్ 10 నుంచి ఈ నిర్ణయం అమల్లో ఉన్నట్లు పేర్కొంది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్–2006లోని సెక్షన్ 30(2)(a) కింద టీజీ సేఫ్ ఆదేశాలు జారీ చేసింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 11.09.2026
www.mudranews.in | @mudranews



**విటమిన్-డి కోసం ఉదయపు ఎండ**

ఎముకల బలంతో పాటు ఇమ్యూనిటీకి విటమిన్-డి అవసరం. ఉదయపు ఎండ తగలడం అలవాటు చేసుకోవాలి. సప్లిమెంట్లు మాత్రం వైద్యుల సలహాతోనే తీసుకోవాలి.



# బ్యాంక్ ఉద్యోగుల సమ్మె విజయవంతం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఇచ్చిన పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా బ్యాంక్ ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. శుక్రవారం భువనగిరి పట్టణంలో యాదాద్రి భువనగిరి జిల్లా కు చెందిన వివిధ బ్యాంక్స్ కి సంబంధించిన ఉద్యోగులందరు స్థానిక భువనగిరి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ ఆఫీసు నుంచి ర్యాలీ గా బయల్దేరి పాత బస్టాండ్ మీదుగా వినాయక చౌరస్తా వరకు నిర్వహించారు. ఈ సందర్భంగాయాదాద్రి భువనగిరి జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య సెక్రటరీ కె. సురేష్ మాట్లాడారు. చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న బ్యాంక్ ఉద్యోగుల డిమాండ్ 5 రోజుల పని దినాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. పెర్ఫార్మెన్స్ లింక్డ్ ఇన్సెంటివ్ లో చూపుతున్న వివక్షతకు వ్యతిరేకంగా సమ్మె నిర్వహించినట్లు తెలిపారు. సెప్టెంబర్ 28,29,30 న వరుసగా మళ్ళీ సమ్మె లో పాల్గొంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య ఆఫీసర్స్ అసోసియేషన్ సిసి మెంబర్ ఈ రఘు, యూనియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్,తెలంగాణ గ్రామీణ బ్యాంక్,నల్గొండ జిల్లా కోపరేటివ్ బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.





**ఖమ్మంలో..**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 11 :** దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగులు ఒకరోజు సమ్మె నిర్వహించారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు ఏడు ప్రధాన యూనియన్లు ఐక్యంగా పాల్గొనడంతో బ్యాంకుల కార్యకలాపాలు నిలిచిపోయాయి. జిల్లాకేంద్రంలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. బ్యాంకింగ్ సేవలు నిలిచిపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఐదు రోజుల పని దినాల విధానాన్ని అమలు చేయాలని, వివక్షాపూరితంగా ఉన్న పర్ఫార్మెన్స్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లపై తక్షణమే స్పందించకపోతే ఈ నెల 28, 29, 30 తేదీల్లో మూడు రోజుల సమ్మె, అక్టోబర్ 26 నుండి పూర్తిస్థాయి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

## విద్యార్థులు మంచిగా చదివి

# ఉన్నత స్థానాలకు ఎదగాలి

**.-అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**

**.ముద్ర, మోత్కూర్:** అడ్డగూడూరు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరావు సందర్శించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కేజీబీవీలో విద్యార్థినులకు అందుతున్న విద్య, వసతులు, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, వసతులపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత సాయికి ఎదగాలని అదనపు కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు



మెరుగైన వసతులు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థినుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో మట్టి వినాయకుల తయారీ

**ముద్ర, మోత్కూర్:** మండలంలోని పాలడుగు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో మట్టి వినాయకుల తయారీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు స్వయంగా మట్టితో వినాయక విగ్రహాలను తయారు చేసి తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. పర్యావరణానికి హాని కలిగించని మట్టి వినాయకులను ఉపయోగించడం ద్వారా ప్రకృతిని పరిరక్షించాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల లో పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని ప్రధానోపాధ్యాయులు వెంకటగిరి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ కు వినతి

**ముద్ర, మోత్కూర్:** మోత్కూర్ మున్సిపాలిటీ లోని పలు సమస్యలు పరిష్కరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్ మాట్లాడుతూ మోత్కూర్ మున్సిపాలిటీలో స్మశానవాటికలో వసతులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని స్మశాన వాటిక దగ్గర పెద్దమ్మ గుడి నుండి బిక్కేరు వాగు వరకు 20 ఫీట్ల రోడ్డు సిసి రోడ్డు నిర్మించాలని అలాగే అన్ని వార్డులలో దోమలు విపరీతంగా ఉండి విష జ్వరాలు వచ్చే ప్రమాదం ఉన్నందున దోమల వ్యాక్సిన్ డ్రైనేజీలలో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని అలాగే కోతుల సమస్య నుండి శాశ్వత పరిష్కారం కనుగొనాలని వడ్డెర కాలనీ నుండి సుందర కాలనీ వరకు కరెంటు స్తంభాలు వేశారు కానీ లైట్లు వేయలేదని తక్షణమే లైట్లు వేయించలని బుజలాపురంలో డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని అట్లాగే కుక్కల బెడద నుండి మోత్కూర్ మున్సిపాలిటీ ప్రజలను రక్షించాలని వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా గీతా పనివారాల సంఘం అధ్యక్షులు చాపల అంజయ్య , సిపిఐ పట్టణ కార్యదర్శి బి ఉప్పలయ్య, పుల్కరం మల్లేష్, చేనేత సహకార సంఘం కోశాధికారి పోచం కన్నయ్య, తాడూరు లక్ష్మి నరసయ్య ,బీసీ సంఘం అధ్యక్షులు పెండే వెంకటేశ్వర్లు, గొలుసుల యాదగిరి పాల్గొన్నారు



# తీన్మార్ మల్లన్నపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి

**ముద్ర, మోత్కూర్:** మోత్కూర్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో రెడ్డి జాతి పైన అసభ్యకరంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న పై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని మోత్కూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు .ఈ సందర్భంగా మోత్కూర్ రెడ్డి సంఘం అధ్యక్షుడు లింగాల జైపాల్ రెడ్డి మాట్లాడుతూ కులాల మధ్య జాతుల మధ్య వైశమ్యాలు సృష్టించి రాజకీయంగా ఎదగాలనుకోవడం మూర్ఖత్వం అని తీన్మార్ మల్లన్నకు రాజకీయంగా గానీ,వ్యక్తిగతంగా కానీ ఏదైనా ఉంటే దాన్ని ఆ వ్యక్తులతో చూసుకోవాలి కాని మొత్తం రెడ్డి జాతినే అవమానించేలా మాట్లాడితే మాత్రం ఊరుకునేది లేదని తీన్మార్ మల్లన్నకు తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పైళ్ల సోమిరెడ్డి, ముప్ప వెంకటరెడ్డి, బద్దం రామ నర్సింహారెడ్డి, పుల్సాని వెంకటరెడ్డి , అమనగంటి వెంకటరెడ్డి, గంటా వేమల్ రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# అభివృద్ధి పనులు ప్రారంభం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి పట్టణంలోని 7వ వార్డులో రూ.2.00 లక్షలు మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో మురికి కాలువ పై స్లాబ్ నిర్మాణ పనులకు,18వ వార్డులో రూ.2.00 లక్షలతో మురికి కాలువ పై స్లాబ్ నిర్మాణ పనులకు చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ కొబ్బరి కాయలు కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ లు కుక్కదువ్వ పద్మ సోమయ్య, పాశం అమర్ నాథ్, వార్డు ప్రజలు, నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# కమ్యూనిస్టుల పోరాటంతోనే నిజాం పాలన అంతం

**సీపీఐ నేత బాగం**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 11 :** సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పాత బస్టాండ్ సమీపంలోని నల్లమల గిరిప్రసాద్ విగ్రహానికి పూలమాల వేసి, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ కమ్యూనిస్టుల వీరోచిత పోరాటాల వల్లే తెలంగాణకు నిజాం పాలన నుండి విముక్తి లభించిందని కొనియాడారు.భూమి, భుక్తి, వెట్టిచాకిరీ ముక్తి కోసం సాగిన ఈ చారిత్రిక పోరాటంలో 4 వేల మంది అమరులయ్యారని, వేలాది గ్రామాలు భూస్వాముల చెర నుండి విముక్తి పొంది పేదలకు భూమి దక్కిందని గుర్తుచేశారు. నేటి సమాజంలో మతతత్వం, ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, అమరుల త్యాగాల స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలపై భవిష్యత్తు పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జమ్ముల జితేందర్ రెడ్డి, యర్రా బాబు, జానీమియా, క్లైమెట్, సలాం పలువురు నాయకులు పాల్గొన్నారు.



# దళిత ద్రోహులకు బుద్ధి చెప్పేదాకా వదలం

**కాంగ్రెస్ దళిత గర్జనలో నాయకులు**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 11:** బీఆర్ఎస్, బీజేపీ పార్టీల దళిత వ్యతిరేక, మనువాద వైఖరిని ఖండిస్తూ ఖమ్మం నగరంలో కాంగ్రెస్ శ్రేణులు నిరసన ర్యాలీ నిర్వహించాయి. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరిల నాయకత్వంలో సంజీవరెడ్డి భవన్ నుంచి జెడ్పీ సెంటర్‌లోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు కార్యకర్తలు ఈ గర్జన ర్యాలీలో పాల్గొన్నారు. విగ్రహం వద్దకు చేరుకున్న అనంతరం కాంగ్రెస్ నాయకులు బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ నాయకులపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఉత్తరాఖండ్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు, దళిత నాయకుడు మల్లిఖార్జున ఖర్గే పర్యటించిన ప్రదేశాన్ని బీజేపీ మనువాదులు పసుపు నీళ్లతో కడిగిన వికృత సంఘటన మరువక ముందే, తెలంగాణలో బీఆర్ఎస్ అదే సంస్కృతిని కొనసాగిస్తోందని మండిపడ్డారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో దళిత వ్యతిరేక చర్యలకు పాల్పడే పార్టీలకు తెలంగాణ ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, రాయల నాగేశ్వరరావు, మహ్మద్ ఖాదర్ బాబా, పులిపాటి వెంకయ్యతో పాటు ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# భూ పోరాటాలు కొనసాగిస్తాం

**వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల స్ఫూర్తితో భూ పోరాటాలు కొనసాగిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు తెలిపారు. శుక్రవారం సుందరయ్య భవన్, భువనగిరిలో జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటి సమావేశం రాష్ట్ర కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి అధ్యక్షత వహించగా ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వెంకట్రాములు పాల్గొని మాట్లాడుతూ ఎర్రజెండా నాయకత్వంలో సాగించిన మహోత్తరమైన పోరాటమే వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమని తెలిపారు. ఈ పోరాట ఫలితంగా 10 లక్షల ఎకరాలకు పైగా భూమిని పేదలకు దక్కిందని, 3 వేలకు పైగా గ్రామాలు విముక్తి పొంది గ్రామ స్వరాజ్యాలను ఏర్పాటు చేసుకున్నారని, 4 వేలకు పైగా ప్రజలు, కమ్యూనిస్టు యోధులు, రైతు కూలీలు చనిపోయారని తెలిపారు. కౌలు రైతులకు భూములపై హక్కును కల్పించే కౌల్దారి చట్టాన్ని సాధించామని చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు రాచకొండ రాములమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు సిరిపంగి స్వామి, గుంటోజి శ్రీనివాస్ చారి, అల్లూరి కుమార్, సహాయ కార్యదర్శిలు పల్లెర్ల అంజయ్య, జూకంటి పౌల్, జిల్లా కమిటీ సభ్యులు చింతకాయల నర్సింహ, కొండపురం యాదగిరి, మానె సాలయ్య, గ్యార అండాలు, చింతల సుదర్శన్, యాట బాలరాజు, కొండే కిష్టయ్య, మేడి ముకుందం పాల్గొన్నారు.




# సాగునీరు, విద్యుత్ లేక రైతుల అవస్థలు

**మాజీ మంత్రి పువ్వాడ**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబరు 11 :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీరు, ఉచిత విద్యుత్ సరఫరా సరిగా లేక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. పంటలకు అవసరమైన నీరు, కరెంటు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. ఎల్ నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా ప్రభుత్వం ఎలాంటి ముందస్తు ప్రణాళికలు రచించకపోవడం వల్లే నేడు పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలపై బీఆర్ఎస్ పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదని మండిపడ్డారు. అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పర్యటించి ఎండిపోతున్న పంటలను పరిశీలించాలని, అత్యవసర ప్రాతిపదికన సాగునీరు, విద్యుత్ అందించి రైతులను ఆదుకోవాలని పువ్వాడ అజయ్ కుమార్ డిమాండ్ చేశారు.




# ప్రభుత్వ వైద్యానికి అధునాతన బలం

**అందుబాటులోకి పోర్టబుల్ అల్ట్రాసౌండ్, ఎక్స్‌రేలు**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, సెప్టెంబర్ 11:** ప్రభుత్వ ఆసుపత్రి అంటే సాధారణ వైద్యం మాత్రమే అనే భావనను మారుస్తూ ఖమ్మం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో ఆధునిక సేవల విస్తరణ వేగవంతమైంది. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక పర్యవేక్షణ, రాష్ట్ర మంత్రుల చొరవతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఖరీదైన నిర్ధారణ పరీక్షలు ఉచితంగా అందుతున్నాయి.ఇప్పటికే ఆసుపత్రిలో 3 కొత్త పోర్టబుల్ అల్ట్రాసౌండ్ యంత్రాలు, పోర్టబుల్ ఎక్స్‌రే సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో తీవ్ర అనారోగ్యంతో కదలలేని రోగులకు పడక వద్దే వేగంగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. రూ. 6 వేల నుంచి రూ. 8 వేల వరకు ఖర్చయ్యే 'టిఫ్ఫా' స్కాన్లను మాతా-శిశు సంరక్షణ కేంద్రంలో ఉచితంగా అందిస్తూ, జనవరి నుంచి ఆగస్టు వరకు 546 గర్భిణులకు అండగా నిలిచారు. మొత్తం 16,961 మాతా-శిశు స్కాన్లు, 13,816 అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహించారు. నిరంతర సీటీ స్కాన్, కలర్ డాప్లర్ సేవలతో పాటు త్వరలోనే ఎంఆర్ఐ యంత్రాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సహా సివిల్ పనులు వేగంగా పూర్తి చేస్తున్నారు.రేడియాలజీ విభాగాన్ని పటిష్టం చేస్తూ డాక్టర్ సురేందర్, డాక్టర్ మురళీకృష్ణలను కేటాయించడమే కాకుండా, ఖాళీగా ఉన్న అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టారు. అధునాతన యంత్రాలు, వైద్య నిపుణులు అందుబాటులోకి రావడంతో ప్రజలకు నాణ్యమైన వైద్యం మరింత చేరువైంది. ప్రజలు ఈ ఉచిత ప్రభుత్వ వైద్య సేవలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.




# పద్య పఠన పోటీల విజేతలకు బహుమతులు




**ముద్ర, మోత్కూర్:** ఏకాగ్రత ధారణా శక్తిని పెంపొందించే పద్య పఠనాన్ని ప్రతి విద్యార్థి సాధన చేయాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరవింద రాయుడు అన్నారు. శుక్రవారం పాఠశాల విద్యార్థులకు పద్యపఠన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషకి ప్రత్యేకమైన పద్యాన్ని చదవడం వల్ల భాషా పరిజ్ఞానం తో పాటు ఏకాగ్రత ధారణాశక్తి వికాసం చెందుతుందని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విశ్రాంత లెక్చరర్ వడ్డేపల్లి లక్ష్మీ నర్సయ్య సౌజన్యంతో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజయ్య, రాంప్రసాద్, శ్రీనివాస్, లలిత కుమారి, వెంకటయ్య, సుధీర్, కుమార్, వెంకటా చారి, ప్రవీణ్, రవి, లింగయ్య, రవికుమార్, కవిత, జయశ్రీ, స్వప్న, ఉప్పలయ్య, వెంకటేశ్వర్లు ,అశోక్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు,

# ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బండారు ప్రశాంత్ రెడ్డి

**ముద్ర, మోత్కూర్:** మోత్కూర్ మున్సిపాలిటీ కి చెందిన బండారు ప్రశాంత్ రెడ్డి ని ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నట్టు ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎడ వెల్లి వెంకట స్వామి గురువారం ఉత్తర్వులు జారీ చేసారు. విద్యార్థి విభాగం లో చురుకుగా పనిచేస్తు నాటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కార్యక్రమాలలో చురుకుగా గా పాల్గొంటు కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగంలో చురుకుగా పాల్గొని ఉంటున్నందుకు రాష్ట్ర కార్య వర్గం గుర్తించి ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు.విద్యార్థి దశ నుండి పార్టీ కోసం కష్టపడుతున్న నిబద్ధత గల నాయకుడికి గా గుర్తించి ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులు ఎడవెల్లి వెంకట స్వామి నాయకత్వానికి పార్టీ శ్రేణులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాలేజీలు, యూనివర్సిటీల స్థాయిలో ఎన్ ఎస్ యు ఐ బలోపేతానికి కృషి చేస్తాని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



# మానవతాదృక్పథం చాటిన సూర్యాపేట ఎస్పీ

**ముద్ర, సూర్యాపేట, సెప్టెంబర్ 11:** పేదరికాన్ని అధిగమించి ప్రతిభతో గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థిని మామిడి ఇందుకు సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ అండగా నిలిచారు. ఆమె వైద్య విద్యకు తన వంతు సహాయంగా రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు.పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామానికి చెందిన మామిడి అంజయ్య-ప్రసన్న దంపతుల కుమార్తె ఇందు. తండ్రి దివ్యాంగుడు కాగా ప్రభుత్వ పాఠశాలలో తాత్కాలిక స్కావెంజర్‌గా పని చేస్తున్నారు. తల్లి దినసరి కూలీగా పనిచేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇందు పట్టుదలతో చదివి NEETలో మంచి ర్యాంక్ సాధించి గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించారు.ఇందు విద్యకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న విషయం సోషల్ మీడియాలో వెలువడటంతో ఎస్పీ నరసింహ స్పందించి తన కార్యాలయంలో రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పేదరికం లక్ష్యానికి అడ్డంకి కాదని, పట్టుదలతో కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చని ఇందు నిరూపించారని అభినందించారు. ఆమె వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి పేదలు, ఆర్థికంగా వెనుకబడిన వారికి సేవలందించే మంచి వైద్యురాలిగా ఎదగాలని ఆకాంక్షించారు.కష్టపడి చదివే విద్యార్థులకు సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్న ఎస్పీ.. ఇందు విద్యాభ్యాసంలో భవిష్యత్తులో ఏదైనా సమస్య ఎదురైతే తనను సంప్రదించాలని, తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు.కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పోలీస్ వెల్ఫేర్ ఆర్ఎస్ఐ సాయిరాం పాల్గొన్నారు.

